ఆపదమిత్రలకు విపత్తుల నిర్వహణపై శిక్షణ

కరీంనగర్ రూరల్, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): అగ్ని మాపక శాఖఎంపిక చేసిన 90 మంది ఆపద మిత్రలకు సోమవారం కరీంనగర్ రూరల్ మండలం చామనపల్లి గ్రామంలో విపత్తుల నిర్వహణపై శిక్షణ, ఫీల్డ్ విజిట్ నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి క్షేత్ర స్థాయిలో పరి స్థితుల విశ్లేషణ చేశారు. ప్రజలకు విపత్తులు వచ్చిన ప్పుడు తీసుకో వాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పిం చారు. క్షేత్రస్థాయిలో గమనించిన పరిస్థితులను విశ్లేషిస్తు సామాజిక చిత్ర పటం, వనరుల చిత్ర పటాలను వేశారు. అనంతరం గ్రామ విప త్తుల నిర్వహణ ప్రణాళికను రూపొందించారు. కార్యక్ర మంలో జిల్లా అగ్ని మాపక నిర్వహణ అధికారి శ్రీనివాస్‌రెడ్డి, ఎంపీవో సీహెచ్ జగన్ మోహన్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శి మహేందర్‌రావు,ఎస్‌ఐసీసురేందర్‌రెడ్డి, సంపత్ పాల్గొన్నారు.

ఉద్యమకారుల సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి

సుభాష్‌నగర్, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ ఉద్యమకారుల కోసం సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని ఉద్యమకారుల జేఏసీ చైర్మెన్ సుల్తాన్ యాదగిరి డిమాండ్ చేశారు. సోమవారం నగరంలోని ఫిల్మ్‌భవన్‌లో టీయూ జేఏసీ జిల్లా కార్యవర్గ సమావేశాన్ని నిర్వహిం చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమకా రులకు ప్రభుత్వం గుర్తింపు కార్డులు ఇవ్వాలని, 250 గజాల స్థలాన్ని ఇవ్వాలని, ప్రతి ఉద్యమకారుడికి ఇల్లు కట్టించి ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఉద్యమ కారుల సమస్యలు పరిష్కరించకపోతే ఉద్యమం చేపడతా మని హెచ్చరిం చారు. కార్యక్రమంలో బోగె పద్మ, కోతి మాధవి, శనిగరపు యువరాజ్, కర్నుల్ల శ్రీనివాస్, కురివి వేణుగోపాల్, రాజు, కన్నం లక్ష్మణ్, డోలక్ యాదగిరి, బాబన్న, గుండా యాదగిరి, రాజేంద్రప్రసాద్ పాల్గొన్నారు.

ఓం నమశ్శివాయ



పాతబజార్ గౌరీశంకరాలయంలో డ్రైఫ్రూట్స్‌తో అలంకరణ

శ్రావణ మాస సోమవారం సందర్భంగా నగరంలోని ఆలయాల్లో ప్రత్యేక పూజలు, అభిషేక, అలంకారాలు ఘనంగా నిర్వహించారు. శివాలయాలు భక్తులతో కిటకి టలాడాయి. భక్తులు ఉపవాసాలు పాటిస్తూ పూజలు జరిపి అర్చనలు చేయించుకున్నారు. పాతబజార్ గౌరీశంకరాలయం, కమాన్‌రోడ్ రామేశ్వరాలయం, ఆదర్శనగర్ రాజరాజేశ్వరస్వామి ఆలయం, భగత్‌నగర్ భవానీ శంకరాలయంతోపాటు శివపంచాయతనం గల ఆలయాల్లో అభిషేక పూజల్లో భక్తులు పాల్గొన్నారు. పాత బజార్ గౌరీశంకరాల యంలో శివయ్యను డ్రైఫ్రూట్స్‌తో అలంకరించారు. ఈ సందర్భంగా స్వామివారికి ప్రత్యేక అలంకరణ చేశారు. హౌసింగ్‌బోర్డ్ కాలనీలోని ఉమామహేశ్వరాలయంలో లక్ష బిల్వార్చన నిర్వహించారు.

- కరీంనగర్ కల్చరల్, ఆంధ్రజ్యోతి

విద్యార్థినుల రాఖీలతో మురిసిన అధికారులు



విద్యార్థినులు కట్టిన రాఖీలను చూపిస్తున్న కలెక్టర్ పమేలా సత్పతి, అధికారులు

నిత్యం తమ పనుల్లో బిజీగా ఉండే అధికారులు విద్యార్థినులతో రాఖీలు కట్టించుకుని మురిసిపోయారు. కలెక్టరేట్ ఆవరణలో జిల్లాలోని కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయాల్లోని విద్యార్థినులు ఏర్పాటు చేసిన ఆర్ట్స్, క్రాఫ్ట్స్ మేళాను కలెక్టర్ పమేలా సత్పతి సోమవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థినులు తయారు చేసిన వస్తువులు చాలా బాగున్నాయని కలెక్టర్ ప్రశంసించారు. విద్యార్థులు స్వయంగా తయారు చేసిన రాఖీలను కలెక్టర్, అధికారులకు కట్టారు. కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్లు అశ్విని తానాజీ వాకడే, లక్ష్మీ కిరణ్, మున్సిపల్ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్, జిల్లా రెవెన్యూ అధికారి వెంకటేశ్వర్లు, ఆర్డీవోలు మహేశ్వర్, రమేష్ పాల్గొన్నారు.

-సుభాష్‌నగర్, ఆంధ్రజ్యోతి

ఆసుపత్రుల్లో మందుల కొరత లేదు

- సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి
- ప్రజారోగ్య కుటుంబశాఖ డైరెక్టర్ డాక్టర్ రవీందర్‌నాయక్
- జిల్లా జనరల్ ఆసుపత్రి సందర్శన



ప్రభుత్వ ఆసుపత్రిలో సూపరింటెండెంట్, వైద్యులతో మాట్లాడుతున్న డాక్టర్ రవీందర్ నాయక్

సుభాష్‌నగర్, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వాసుపత్ర ులు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో మందుల కొరత లేదని రాష్ట్ర మెడికల్ అండ్ హెల్త్ డైరెక్టర్ డాక్టర్ రవీందర్‌నాయక్ తెలిపారు. సోమవారం జిల్లా పర్యటనలో భాగంగా జిల్లా జనరల్ ఆసుపత్రిని సందర్శించారు. ఈ సంద ర్భంగా ఆసుపత్రిలోని వార్డులు, ల్యాబ్‌లను పరిశీలించి ప్రజలకు అందుతున్న సేవలను తెలుసుకున్నారు. అనంతరం ఆసుపత్రి సూపరిం టెండెంట్, డీఎం హెచ్‌ఓ, ఆసుపత్రి డాక్టర్లు, నర్సింగ్ ఆఫీసర్లు, సిబ్బందితో సమీక్షా సమా వేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలన్నారు. నాన్ కమ్యూనల్ డిసీజ్‌తోపాటు ఇతర వ్యాధులకు సంబంధించిన మందులను అందుబాటులో ఉంచుకో వాలని సూచించారు. వినియోగం మేరకు మందులను ఎప్పటికప్పుడు సమ కూర్చుకోవాలన్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల నుంచి వస్తున్న రిఫరల్ కేసులకు ప్రాధాన్యం ఇచ్చి ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందిం చాలన్నారు. అనంతరం అపోలోరీచ్ ఆసుపత్రి, మానకొండూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించారు. కార్యక్రమంలో ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ వీరారెడ్డి, డీఎంహెచ్‌వో డాక్టర్ వెంకటరమణ, ఆర్ఎంవో డాక్టర్ నవీన, డీటీసీవో డాక్టర్ రవిందర్‌రెడ్డి, జిల్లా మలేరియా అధికారి డాక్టర్ రాజగోపాల్‌రావు, మలేరియా సబ్‌యూనిట్ ఆఫీసర్ రామనాథం, ఎన్‌హెచ్‌ఎంపీవో స్వామి పాల్గొన్నారు.

వైద్య సేవలు మెరుగయ్యేదెన్నడు?

- ప్రారంభానికే పరిమితమైన క్రిటికల్ కేర్
- క్యాథ్‌ల్యాబ్ లేక అందని కార్డియా సేవలు
- ఇతర విభాగాలదీ అదే పరిస్థితి



(ఆంధ్రజ్యోతి ప్రతినిధి, కరీంనగర్)

జిల్లాలో ప్రభుత్వ వైద్య కళాశాల ఏర్పడి రెండేళ్లు పూర్తయ్యాయి. టీచింగ్ హాస్పిటల్‌గా ప్రకటించిన జిల్లా జనరల్ ఆసుపత్రిలో ఆ స్థాయికి తగిన ఏర్పాట్లు చేయడంలో ప్రభుత్వం అంతగా శ్రద్ధ చూపించడం లేదు. జిల్లా జనరల్ ఆసుపత్రులను బోధనాసుపత్రుల స్థాయికి తీర్చిదిద్దే విషయంలో అడుగులు వేగంగా పడడం లేదు. జిల్లా కేంద్రంలో ఉన్న ప్రధాన ఆసుపత్రిని రెండేళ్ల క్రితం ఏర్పడిన ప్రభుత్వ మెడికల్ కళాశాలకు టీచింగ్ హాస్పిటల్‌గా ప్రకటించారు. 750 పడకలు ఉన్న ఈ ఆసుపత్రిలో 500 నుంచి వెయ్యి మంది వరకు రోగులు ప్రతిరోజు వివిధ పరీక్షలు, చికిత్సల కోసం వస్తుంటారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా, కరీంనగర్ జిల్లాలలో ఉన్న ప్రభుత్వ ఆసుపత్రిలన్నింటి నుంచి ఇక్కడికి అత్యవసర పరిస్థితుల్లో రోగులను పంపిస్తుంటారు. అయినా ఈ ఆసుపత్రిలో ఇంకా మెరుగైన సేవలు అందించడానికి ఏర్పాట్లు మాత్రం లేకుండా పోయాయి.

అందుబాటులోకి రాని క్రిటికల్ కేర్ సేవలు

బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో 2023 మార్చిన అప్పటి వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి టి హరీశ్‌రావు క్రిటికల్ కేర్ విభాగ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. రెండేళ్లకు పూర్తయిన క్రిటికల్ కేర్ విభాగాన్ని జూలై 28న కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్ ప్రారంభించారు. కేంద్రం 23.75 కోట్ల రూపాయలు వెచ్చించి ఈ భవనాన్ని నిర్మించిందని, ఈ భవనాన్ని వినియోగంలోకి తీసుకురావడానికి అవసరమైన సౌకర్యాలు కల్పించడంతోపాటు సూపర్ స్పెషాలిటీ వైద్యులను నియ మించి రోగులకు సేవలందించాలని ఆయన రాష్ట్ర ప్రభు త్వానికి సూచించారు. క్రిటికల్ కేర్ విభాగానికి నామమా త్రంగా భవనం నిర్మించారుగాని అవసరమైన సూపర్ స్పెషాలిటీ డాక్టర్ల నియామకాలు చేపట్టలేదు. ఒక మినీ థియేటర్‌ను నిర్మించి కొన్ని బెడ్స్‌ను ఏర్పాటు చేశారు. మల్టీ పారా మానిటర్స్, అడ్వాన్స్ టేబుల్స్ వచ్చాయి. ఈ విభా గంలో ఉండాల్సిన మూడు పెద్ద ఆపరేషన్ థియేటర్ల ఏర్పా టు ఇంకా ప్రారంభం కాలేదు. న్యూరో సర్జరీకి సంబం ధించిన పరికరాలు, న్యూరో సీఆర్మ్ కార్డియాలజీకి సంబం ధించిన పరికరాలు, న్యూరాలజీకి సంబంధించిన పరికరాలు సమకూర్చాల్సిన అవసరం ఉన్నది. క్రిటికల్ సేవలు అం

(మిగతా 8వపేజీలో)

గుండె సమస్యలకు అందని వైద్యం

క్యాథ్‌ల్యాబ్ లేకపోవడంతో రోగులను ఇక్కడ నుంచి నిమ్స్‌కు గాని, ఎంజీఎంకు గాని, ఉస్మానియా, గాంధీ ఆసు పత్రులకు పంపిస్తున్నారు. క్యాథ్‌ల్యాబ్ ఉంటే గుండె పోటుకు గురైన వారికి యాక్సిడెంట్లు, తదితర సందర్భాలలో కార్డియాక్ సమస్యలు ఉత్పన్నమైన వారు గాని, అత్యవసర చికిత్స పొందే అవకాశం ఉంటుంది. యాంజియోగ్రామ్ నిర్వహించడంతోపాటు అత్యవసర పరిస్థితుల్లో స్టంట్ వేసే సౌకర్యం కూడా ఈ క్యాథ్‌ల్యాబ్ వల్లనే సమకూరుతుంది. రోడ్డు ప్రమాదాలు జరిగిన సందర్భంలో న్యూరో, ఆర్థో, కార్డియాక్ సంబంధిత సేవలు అవసరమవుతాయి. కార్డియాలజీ, న్యూరో సర్జన్, న్యూరో ఫిజిషియన్, జనరల్ సర్జన్, జనరల్ మెడిసిన్, ఎమర్జెన్సీ జనరల్ మెడిసిన్, న్యూరో ఫిజిషియన్, పీడియాట్రిక్ విభా గాలకు చెందిన సుమారు 50 మంది ఎండీడీఎం, ఎంఎస్ ఎంసీహెచ్ సూపర్‌స్పెషలిస్టులను, ఇతర వైద్యులను నియమించాల్సి ఉన్నది. వీరు లేని కారణంగా అత్యవసర సమయాల్లో సత్వర వైద్య సేవలకోసం రోగు లు ప్రైవేట్ ఆసుపత్రులకు వెళ్లాల్సి వస్తున్నది. ఆయా ప్రైవేట్ ఆసుపత్రుల్లో క్యాథ్‌ల్యాబ్, ఇతర సౌకర్యాలు పొందడానికి లక్ష నుంచి మూడు లక్షల రూపాయల వరకు బిల్లులు చెల్లించాల్సి వచ్చి సామాన్యులు అప్పులపాలవుతున్నారు. అటు ప్రజలకు వైద్య సేవలు అందించడం, ఇటు వైద్య విద్యార్థులకు విద్యాభ్యాసం చేసుకునే వీలు కలిగించేందుకు అవసరమైన సూపర్ స్పెషాలిటీ విభాగాలను క్రిటికల్ కేర్ విభాగాన్ని వెంటనే ప్రారంభించాల్సిన అవసరం ఉన్నది.

నులి పురుగుల నివారణ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి

సుభాష్‌నగర్, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): నులి పురుగుల నివారణ కార్యక్రమాన్ని విజయ వంతం చేయాలని కలెక్టర్ పమేలాసత్పతి కో రారు. సోమ వారం ఆమె జిల్లా అధికారులతో సమావేశం నిర్వ హించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఈ నెల 11న జాతీయ నులిపురుగుల నివారణ కార్యక్రమాన్ని పురస్క రించుకుని జిల్లాలోని 1 నుంచి 19 సంవత్సరాల వయస్సు ఉన్న వారికి అల్బెండజోల్ మాత్రలను పంపిణీ చేస్తామని తెలి పారు. జిల్లా వైద్యాధి కారి, జిల్లా విద్యాధికారి, జిల్లా సంక్షేమాధికారి, ఇంటర్మీడియట్ అధి కారుల సమ న్వయంతో ఈ కార్యక్ర మాన్ని విజయవంతం చేయా లని సూచించారు. జిల్లాలోని అన్ని పాఠ శాలలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో విద్యార్థులను కూర్చోబెట్టేందుకు బెం చీలు లేదా మ్యాట్లను ఉపయో గిం చాలని సూచించారు. ఏ పాఠశా లలోనైనా బెంచీలు, ఇతర ఫర్నీచర్ వృధాగా ఉంచరాదన్నారు. వన మహోత్సవం కార్యక్రమంలో భా గంగా వివిధ ప్రభుత్వ శాఖలకు ఇ చ్చిన లక్ష్యాన్ని పూర్తిచేయా లన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్

ప్రజావాణికి 290 దరఖాస్తులు

ప్రజావాణి కార్యక్రమానికి 290 దరఖాస్తులు వచ్చినట్లు కలెక్టర్ పమేలాసత్పతి తెలిపారు. సోమ వారం కలెక్టరేట్‌లోని ఆడిటోరియంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లాలోని వివిధ ప్రాం తాలనుంచి వచ్చిన వారి నుంచి అర్జీలు స్వీకరిం చారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అట్టి దరఖాస్తులను పరిశీలించి త్వరితగతిన వాటిని పరిష్కరించాలని సంబంధి అధికారులను ఆదేశిం చారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు అశ్విని తానాజీ వాఖడే, లక్ష్మికిరణ్, మున్సిపల్ కమిషనర్ ప్రఫుల్‌దేశాయ్, డీఆర్వో వెంకటేశ్వర్లు, ఆర్డీవోలు మహేశ్వర్, రమేశ్ పాల్గొన్నారు.

స్వచ్ఛత హరిత పాఠశాల ర్యాంకింగ్‌కు సహకరించాలి

కరీంనగర్ (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): జిల్లాలో స్వచ్ఛత పాఠశాలల ర్యాంకింగ్, పారిశుధ్య కార్మి కుల సంక్షేమానికి యూనిసెఫ్ సహకరించాలని కలె క్టర్ పమేలాసత్పతి అ న్నారు. సోమవారం కలెక్టర్ చాంబర్‌లో యూనిసెఫ్ బృందంతో సమావేశం నిర్వహించారు. ఈ సంద ర్భంగా కలెక్టర్ మాటా ్డుతూ పారిశుధ్య కార్మికుల సంక్షేమం, సుస్థిర పారి శుధ్యం, పరిశుభ్రత తదితర అంశాలతోపాటు జాతీయ స్థాయిలో స్వచ్ఛత హరిత పాఠశాలల ర్యాంకింగ్ మెరుగుపరిచేందుకు సహకారం అవస రమన్నారు. జిల్లాలో విద్య, వైద్యం, అంగన్‌వాడి శాఖల్లో చేపట్టబోయే సేవా కార్య క్రమాలకు యూని సెఫ్ సహకారం ఉంటుందని బృంద సభ్యులు తెలిపారు. సమావేశంలో యూనిె ్ఫ్ వాష్ స్పెషలిస్టు వెంకటేష్, ఫణీంద్ర, జిల్లా సమన్వయకర్త కిషన్ స్వామి, స్వచ్ఛ భారత్ సమన్వయకర్తలు రమేష్, వేణు, తదితరులు పాల్గొన్నారు.

గురుకులాల్లో దశల వారీగా స్టీల్ వంట పాత్రలు

- మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్

తిమ్మాపూర్, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని అన్ని గురుకుల పాఠశాలల్లో స్టీల్ వంట పాత్రలను దశల వారీగా అందజేస్తామని రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ అన్నారు. సోమవారం



అలుగునూర్‌లోని సీవోఈ పాఠశాలలో విద్యార్థినులతో కలిసి భోజనం చేస్తున్న మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్

కరీంనగర్ కార్పోరేషన్ పరిధిలోని అలుగునూర్ సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాలను మంత్రి సందర్శించారు. ఈ సందర్భంగా మంత్రి విద్యార్థినులతో కలిసి మంత్రి భోజనం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అల్యూమినియం పాత్రలతో ఇబ్బందులు ఎదురవుతున్నాయని స్టీల్ పాత్రలు అందజేస్తున్నా మన్నారు. అలుగునూర్ సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాల నుంచి ఈ కార్యక్రమాన్ని ప్రారం భించడం సంతోషంగా ఉందన్నారు. దేశ వ్యాప్తంగా పేరు పొందిన విద్యాసంస్థల్లో అలుగునూర్ సీవోఈ విద్యార్థులు సీట్లు సాధించడం అభినందనీయమన్నారు. అలుగు నూర్‌ని సివోఈ పాఠశాలలో ఖాళీగా ఉన్న పోస్టు లను వెంటనే భర్తీ చేయాలని సాంఘిక సంక్షేమ గురుకులాల సంస్థ కార్యదర్శి అలుగు వర్షిణికి, కలెక్టర్ పమేలా సత్పతికి మంత్రి సూచించారు.

మూడు నెలల్లో రాష్ట్రంలోని అన్ని గురుకులాల్లో స్టీల్ పాత్రలు

స్టీల్ పాత్రల్లో వంట విధానాన్ని కరీంనగర్‌లో ప్రారంభించామని, మూడు నెలల్లో రాష్ట్రంలోని అన్ని గురుకులాల్లో పూర్తి స్థాయిలో అమలు చేస్తామని సాంఘిక సంక్షేమ గురుకులాల సంస్థ కార్యదర్శి అలుగు వర్షిణి తెలిపారు. వారం రోజుల్లో కావల్సిన ఉపాధ్యాయులను, అధ్యాపకులను నియమిస్తామని తెలిపారు. విద్యార్థులు ఫోన్ మిత్రను ఉపయోగించుకోవా లని, ఏమైనా సమస్యలు ఉంటే ఫోన్ మిత్ర ద్వారా ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయవచ్చని సూచించారు.

స్కూల్ రోజులు గుర్తుకు వచ్చాయి - కలెక్టర్ పమేలా సత్పతి

సీవోఈ పాఠశాలకు రావడంతో తన స్కూల్ రోజులు గుర్తుకు వస్తున్నాయని కలెక్టర్ పమేలా సత్పతి అన్నారు. కార్పొరేట్ స్కూల్స్‌లో నిర్వహించే అసెంబ్లీ కన్నా ఇక్కడ బాగుందని అభినందించారు. జిల్లా యంత్రాంగం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న విద్యావాహిని యూట్యూబ్ ఛానల్ ద్వారా మంచి విషయాలు నేర్చుకోవాల ని కలెక్టర్ పమేలా సత్పతి సూచించారు.

నాలుగు సబ్జెక్టులకు టీచర్లు కావాలి సార్....

సార్ మా గురుకుల పాఠశాలలో నాలుగు సబ్జెక్టులు బోధించేందుకు టీచర్లు లేరు.. మంచి టీచర్లను కేటాయించండి అంటూ మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్‌ను విద్యార్థినులు కోరారు. స్పందించిన మంత్రి అవసరం మేరకు టీచర్లను నియమిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ శ్రీనివాస్ రెడ్డి, తహసీల్దార్ శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

చక్కని మొక్కల బడి

- మొక్కలు నాటిస్తూ.. మార్కులు వేస్తూ ప్రోత్సాహం

7

తిరుమలనగర్ రోడ్డుకు మోక్షమెప్పుడో?

- రెండేళ్లుగా ముందుకు కదలని పనులు
- ఇబ్బంది పడుతున్న జనం



గుంతలమయంగా మారిన తిరుమల్‌నగర్ ప్రధాన రహదారి

కరీంనగర్ టౌన్, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): నగరంలోని తిరుమలనగర్ ప్రధాన రోడ్డుకు మోక్షమెప్పుడో అంటూ స్థానిక ప్రజలు ప్రశ్నిస్తున్నారు. రెండేళ్ల క్రితం నగర పాలక సంస్థ ఉన్న రోడ్డును తొలగించి డ్రైనేజీ, రోడ్డు నిర్మాణ పనులకు శ్రీకారం చుట్టింది. దీంతో రోడ్డు డ్రైనేజీ సమస్యలు తీరుతాయని కాలనీ వాసులు భావించారు. అసెంబ్లీ ఎన్నికలకు ముందు రోడ్డును తవ్వి ఒకటే లేయర్ వేసి అసంపూర్తిగా వదిలేశారు. దీంతో తిరుమలనగర్ ప్రజలు తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారు. రోడ్డు గుంతలమయంగా మారడంతో ప్రమాదాలు జరుగుతున్నాయని, వాహనాలు దెబ్బతింటున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వర్షాలు పడితే రోడ్డు మొత్తం బురదమయం అవుతుందని, దీంతో మరింత ఇబ్బందులు పడాల్సి వస్తుందంటున్నారు. అధికారులు స్పందించి వెంటనే తమ రోడ్డు సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు.

ప్రభుత్వ భవనాలను ప్రైవేట్ వ్యక్తులు వినియోగిస్తే చర్యలు

కరీంనగర్ టౌన్, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): నగరంలోని డివిజన్ కార్యాలయాలు, ప్రభుత్వ భవనా లను ఎవరైనా ప్రైవేట్ వ్యక్తులు వినియో గిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని కమిషనర్ ప్రఫుల్ దేశాయ్ హెచ్చరిం చారు. సోమ వారం నగరంలోని 20, 21, 40, 41 డివిజ న్లలో కమిషనర్ పర్యటిం చారు. వార్డు కార్యాలయాలు, పార్కు లను సందర్శించారు. ఈ సంద ర్భంగా కమిషనర్ మాట్లాడుతూ నగర వ్యాప్తం గా అన్ని డివిజన్లలోని ప్రభుత్వ భవనా లను వార్డు కార్యాలయాలుగా మార్చి విని యోగం లోకి తీసుకురావాలన్నారు. కార్యక్ర మంలో డిప్యూటీ కమిషనర్లు వేణు మాధవ్, ఖాదర్, మోహి యుద్దీన్, మాజీ కార్పొరేటర్లు, వార్డు ఆఫీసర్లు, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



పార్కును పరిశీలిస్తున్న కమిషనర్ ప్రఫుల్ దేశాయ్

తాగునీటి పైప్‌లైన్ పనులు త్వరగా పూర్తి చేయాలి

అమృత్2లో చేపట్టిన తాగునీటి పైప్‌లైన్ పనులను త్వరగా పూర్తి చేయాలని నగరపాలక సంస్థ కమిషనర్ ప్రఫుల్‌దేశాయ్ అధికారులను ఆదేశించారు. ఎల్ఎండీ సమీపంలోని నీటి శుద్ధీకరణ కేంద్రాన్ని ఆయన సోమవారం సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నగర ప్రజలకు సమయానికి అనుగుణంగా తాగునీటిని సరఫరా చేయాలన్నారు. బొమ్మకల్ ప్రాంతంలో వాటర్ ట్యాంక్ నిర్మించేందుకు అధికారులు తగిన చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో డీఈ లచ్చిరెడ్డి, దేవేందర్, పబ్లిక్ హెల్త్ డీఈ సంపత్‌రావు, మిషన్ భగీరథ ఈఈ రామ్‌కుమార్ పాల్గొన్నారు.

అప్పు చెల్లించడం లేదని వ్యక్తి ఆత్మహత్యాయత్నం

హుజూరాబాద్, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): ఇచ్చిన అప్పు తిరిగి చెల్లించాలని అడిగితే చంపుతానని బెదిరించడంతో మనస్థాపానికి గురైన ఓవ్యక్తి సెల్ఫీవీడియోతీసి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన సంఘటన సోమవారం హుజూరాబాద్‌లో చోటుచేసుకుంది. కుటుంబసభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. హుజూరాబాద్ పట్టణానికి చెందిన పంజాల కృష్ణ తనవద్ద ఉన్న రూ.25లక్షలను వనం హరీష్ అనే వ్యాపారికి ఏడాదిన్నర క్రితం అప్పుగా ఇచ్చాడు. అప్పటినుంచి ఇప్పటివరకు డబ్బుల కోసం కృష్ణ, హరీష్ ఇంటికి వెళ్లి అడుగుతున్నా ఇవ్వడం లేదు. ఈ క్రమంలో కృష్ణ తన డబ్బులు తనకు ఇవ్వాలని హరీష్‌ను మరోసారి అడగగా హరీష్ ఇష్టానుసారంగా దూషించాడు. దీంతో మనస్థాపానికి గురై హైస్కూల్‌గ్రౌండ్‌లో సెల్ఫీ వీడియోతీసి గడ్డిమందు తాగాడు. గమనించిన స్థానికులు ఏరియా ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో కృష్ణను మెరుగైన చికిత్స కోసం జమ్మికుంటలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు.

తాటిచెట్టుపై నుంచి పడి గీతకార్మికుడి మృతి


కోట లింగయ్య(ఫైల్)

ఎలిగేడు, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): ముప్పిరితోట గ్రామానికి చెందిన కోట లింగయ్య(55) తాటిచెట్టుపై నుంచి పడగా చికిత్సపొందుతూ మృతిచెందాడు. కులవృత్తిలో భాగంగా సోమవారం కల్లు గీసేందుకు తాటిచెట్టు ఎక్కుతూ జారి కిందపడ్డాడు. గమనించిన చుట్టుపక్కల వారు వెంటనే పెద్దపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. వైద్యుల సూచన మేరకు కరీంనగర్ ఆసుపత్రికి తరలించి, చికిత్స అందిస్తుండగా మృతి చెందాడు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు ఎస్ఐ సత్యనారాయణ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఉరి వేసుకొని ఒకరి ఆత్మహత్య


ఆదిరెడ్డి(ఫైల్)

మల్యాల, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): లారీలు నడుపుకునే వ్యాపారంలో నష్టాలు చవిచూడడంతో మల్యాలకు చెందిన ముకుంద ఆదిరెడ్డి అలియాస్ డ్రైవర్‌రెడ్డి (59) అనే వ్యక్తి ఉరి వేసుకొని ఆదివారం రాత్రి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఎస్సై నరేశ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం ఆదిరెడ్డికి లారీలు ఉండగా కొన్నాళ్లుగా నష్టాలు రావడంతో మానసికంగా బాధపడుతున్నాడు. ఆదివారం రాత్రి ఇంట్లో అందరూ పడుకున్నాక సీలింగ్ ఫ్యాన్‌కు ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. సోమవారం వేకువజామున భార్య చూడగా వెంటనే కుటుంబసభ్యులు జగిత్యాల ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. మృతుని కుమారుడు విక్రం ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

చికిత్స పొందుతూ వృద్ధుడి మృతి

జగిత్యాల క్రైం, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): ద్విచక్ర వాహనంపై నుంచి కింద పడి తీవ్రగాయాలై చికిత్సపొందుతున్న గర్వందుల శ్రీహరి గౌడ్(64) అనే వ్యక్తి సోమవారం మృతి చెందాడు. జగిత్యాలరూరల్ మండలం అంతర్గాం గ్రామానికి చెందిన శ్రీహరిగౌడ్ శనివారం జగిత్యాలకు ద్విచక్ర వాహనంపై ఓ శుభకార్యానికి వెళ్లి తిరిగి వస్తుండగా లింగంపేట చౌరస్తాలో కిందపడి పోగా తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు జగిత్యాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా. చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందాడు. మృతుడు శ్రీహరి గౌడ్ భార్య రమ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పట్టణ పోలీ సులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

అనుమానాస్పద మృతిపై విచారణ వేగవంతం

కరీంనగర్ క్రైం, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ బుట్టిరాజారాం కాలనీకి చెందిన ఐలవేని సంపత్(45) మృతిపై పోలీసులు విచారణ వేగవంతం చేశారు. సంపత్ జూలై 29న ఒక విందుకు హాజరయ్యేందుకు వెళ్లి అదృశ్యమయ్యాడు. ఈనెల1న బొమ్మకల్ ప్రకృతి ఆసుపత్రి సమీపంలో రోడ్డుపక్కన చెట్లపొదల మధ్యన కుళ్లిన స్థితిలో అతడి మృతదేహం లభ్యమైంది. దీంతో మృతుడి కుటుంబ సభ్యులు కరీంనగర్ రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈమేరకు సంపత్ అనుమానాస్పద స్థితిలో మరణించినట్లు పోలీసులు కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు. కాగా సంపత్ హత్యకు గురయ్యాడని పోలీసుల విచారణలో వెల్లడైనట్లు సమాచారం. సంపత్‌ను హత్య చేసింది ఆయన సమీప బంధువులని తెలుస్తోంది. పోలీసులు ఈ ఘటనపై వివరాలు వెల్లడించడంలేదు. సంపత్‌ను ఎవరు హత్య చేశారు? ఎందుకు హత్య చేశారు? అనే వివరాలు విచారణ అనంతరం వెల్లడించే అవకాశముంది.

పర్యావరణ హితం నానో యూరియా



పిచికారి విధానం:

- 2-4 మిల్లీ లీటర్ల నానోయూరియా ప్లస్‌ని లీటర్ నీటిలో కలిపి ఆకులపై, శాఖీయోత్పత్తి దశలో, 20-25 రోజుల తర్వాత రెండో సారి పిచికారి చేయాలి.
- దీర్ఘ కాల, అధిక నత్రజని అవసరమయ్యే పంటలకు అదనపు నానోయూరియా పిచికారి చేసుకోవచ్చు.

ఏ పంటలకు ఏ దశల్లో పిచికారి చేయాలి..

- వరి, మొక్కజొన్న, జొన్న పంటలో పిలక దశలో మొదట, రెండోసారి పూతకు ముందు దశలో, మూడోసారి నత్రజని అవసరాన్ని బట్టి పిచికారి చేసుకోవాలి.
- పత్తి పంటలకు మొదటి దశ శాఖీయోత్పత్తి దశలో, రెండోసారి పూతకు ముందు, కాయ ఏర్పడ్డ దశలో మూడోసారి పిచికారి చేయాలి.
- పండ్లు, పూల పంటలకు నత్రజని అవసరాన్ని బట్టి పూతకంటే ముందు కాయ ఏర్పాటు దశ, కాయ ఎదిగే దశల్లో పిచికారిలు చేసుకోవాలి.

- **నేల, గాలి, నీటి కాలుష్యం నివారణ**
- **చీడపీడలు, తెగుళ్లు ఉధృతికి చెక్**
- **సంకట హరణ బీమా పాలసీ వర్తింపు**
- **వాడకాన్ని పెంచడానికి రైతులకు అవగాహన**

మంథని, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): పర్యావరణ హితమైన నానో యూరియా రైతులకు అందుబాటులోకి వచ్చింది. సాగులో యేటా పెరుగుతున్న ఖర్చులు, ప్రకృతి ఏర్పడే ప్రతికూల పరిస్థితులు, చీడపీడలు, తెగుళ్ళ కారణంగా తగ్గిపోతున్న పంటల దిగుబడితో రైతులు సతమతమవుతున్నారు. ఈ క్రమంలో రైతులకు సంజీవనిలా నానో యూరియా ఇటీవల అందుబాటులోకి వచ్చింది. నానో యూరియా ప్లస్ వినియోగంతో నేల, గాలి, నీటి కాలుష్యంతోపాటు పంటల సాగులో చీడ పీడల, తెగుళ్ళ ఉధృతిని తగ్గిస్తుంది. నానో యూరియా ప్లస్ జీవ సురక్షితమైన పర్యావరణానికి అనుకూలిస్తుంది. దీన్ని నిల్వ, రవాణా సులభతరం. దీన్ని వినియోగం ద్వారా రైతుల పంటలు సంకట హరణ బీమా పాలసీ పరిధిలోకి వస్తాయి. దీని ద్వారా ఏదైన విపత్కర పరిస్థితుల్లో పంట నష్ట పోతే రైతులకు బీమా ద్వారా లబ్ధి పొందే అవకాశం ఉంది. ఇటీవలనే వినియోగంలోకి వచ్చిన నానో యూరియా ప్లస్‌ను వరి, పత్తి, మొక్కజొన్న, జొన్న, చెరుకు, పప్పు దినుసులు, కూరగాయలాంటి వివిధ రకాల పంటల్లో వాడటం వలన కలిగే లాభాలు, ప్రయోజనాలు, దిగుబడి, ఖర్చుల ఆదా, కాలుష్య నివారణపై రైతులకు వ్యవసాయ శాఖ అధికారులు అవగాహన కల్పిస్తున్నారు.

ప్రయోజనాలు:

- నానోయూరియా ప్లస్ అనేది అన్ని పంటలకు నత్రజనిని సమర్థవంతంగా అందిస్తుంది. దీని పిచికారి పంటలలో నత్రజని లోపాలను సరి చేస్తుంది.
- దీని పిచికారి వలన ఎక్కువ పత్ర హరితం, మెరుగైన కిరణజన్య సంయోగ క్రియ సామర్థ్యంతో పంట దిగుబడి పెరుగుతుంది.
- అనుకూలమైన పరిస్థితుల్లో దీన్ని పోషక వినియోగ సామర్థ్యం 90 శాతం కంటే ఎక్కువగా ఉంటుంది.
- సాంప్రదాయ యూరియా కంటే తక్కువ ధర, రైతులకు తక్కువ ఖర్చు.

ఆకులపై పిచికారి:

- నానో యూరియా ప్లస్ ఒక ఎకరాకు 250-500 మిల్లీలీటర్లు పిచికారి చేసుకోవాలి.
- స్ప్రేయర్ రకాన్ని పంట దశను బట్టి అవసరమైన నీటి పరిమాణం మారుతుంది.
- నానో యూరియా ఎకరం పంట విస్తీరానికి 4-6 ట్యాంక్‌ల స్ప్రే ద్రావణం సరిపోతుంది.
- నానో యూరియా ప్లస్ పిచికారి మిశ్రమాన్ని తయారు చేయటానికి శుభ్రమైన నీటి ఉపయోగించాలి.

- ఉదయం లేదా సాయంత్రం వేళ్ళల్లో పిచికారి చేయాలి.
- పిచికారి చేసిన 8 గంటల లోపు వర్షం పడితే మళ్ళీ పిచికారి చేసుకోవాలి.
- 500 ఎంఎల్, ఇఫ్‌కో సహకార సంఘాలు, పీఎంకేఎస్‌కే, విక్రయ కేంద్రాల్లో అందుబాటులో ఉన్నాయి.

ముందు జాగ్రత్తలు:

- తయారీ తేదీ నుంచి 24 నెలల్లో ఉపయోగించాలి.
- ముఖానికి మాస్క్ ధరించాలి.
- చల్లని, పొడి ప్రదేశంలో నిల్వ చేయాలి.
- పిల్లలు, జంతువులకు దూరంగా ఉంచాలి.


రైతులకు అవగాహన కల్పిస్తున్న వ్యవసాయాధికారులు

రూ.7700 పలికిన పత్తి ధర

జమ్మికుంట రూరల్, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): జమ్మికుంట వ్యవసాయ మార్కెట్లో క్వింటాల్ పత్తి ధర రూ.7700 పలికింది. సోమవారం మార్కెట్ యార్డుకు ఇద్దరు రైతులు 15క్వింటాళ్ల విడిపత్తి విక్రయానికి తీసుకువచ్చారు. ప్రైవేట్ ట్రేడర్స్ బహిరంగ వేలంపాట ద్వారా గరిష్ఠ ధర రూ.7700, కనిష్ఠధర రూ.7650 చెల్లించి ప్రైవేట్‌ట్రేడర్స్ కొనుగోళ్లు చేపట్టారు.

ఆలయంలో దొంగతనం

మల్యాల, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రాంపూర్‌లో గల వెంకటేశ్వరస్వామి ఆలయంలో దొంగతనం జరిగినట్లు గ్రామస్థులు తెలిపారు. ఆదివారం రాత్రి ఆలయంలోని రెండు హుండీలను పగులగొట్టి నగదు ఎత్తుకెళ్లినట్లు ఆలయ నిర్వాహకుడు నల్ల రాజేందర్‌రెడ్డి పోలీసులకు ఫిర్యాదుచేశారు. దీంతో పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు జరుపుతున్నారు.

జగిత్యాల ఆలయంలో..

జగిత్యాల క్రైం, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల జిల్లా కేంద్రంలోని లింగంపేట శివారులో ఉన్న గంగమ్మ తల్లి ఆలయంలో సోమవారం చోరీ జరిగింది. దొంగలు ఆలయంలో ఉన్న హుండీని పగులగొట్టి నగదును దోచుకెళ్లారు. గంగపుత్ర సంఘం నాయకులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పట్టణ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

పుస్తెల తాడు చోరీ

జగిత్యాల క్రైం, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల జిల్లా కేంద్రంలోని అరవింద్ నగర్‌లో ఇంట్లో నిద్రిస్తున్న దాసరి ఈశ్వరమ్మ అనే వృద్ధురాలి మెడలో నుంచి ఓ దొంగ పుస్తెల తాడును సోమవారం తెల్లవారుజామున ఎత్తుకెళ్లాడు. ఈశ్వరమ్మ తన ఇంట్లో నిద్రిస్తున్న సమయంలో గుర్తు తెలియనివ్యక్తి ఇంట్లోకి చొరబడి ఆమె మెడలో ఉన్న మూడు తులాల పుస్తెల తాడును అపహరించుకు వెళ్లాడు. బాధితురాలి కుమారుడు మురళి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పట్టణ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

తొగర్రాయిలో గుప్త నిధుల కోసం తవ్వకాలు

సుల్తానాబాద్, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): సుల్తానాబాద్ మండలంలోని తొగర్రాయిలోని పురాతన శివకేశవ అంజనేయ ఆలయంలో గుప్తనిధుల కోసం తవ్వకాలు జరిగాయి. ఈ సంఘటన నెలరోజుల క్రితం జరగగా సోమవారం విషయం వెలుగులోకి వచ్చిందని ఆలయ ధర్మకర్తలు, మాజీ సర్పంచ్ కర్క శంకర్ రెడ్డి తెలిపారు. గ్రామంలోని మానేరు వాగును ఆనుకొని ఉన్న గుడిబండ వద్ద శివ పంచాయతన ఆలయంలో ఐదు విగ్రహాలు ఉంటాయి. ఈ ఐదింటిలో కొన్ని విగ్రహాలను పెకిలించి వాటికింద గుప్తనిధుల కోసంతవ్వారని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. ఈ విషయాన్ని గ్రామ పెద్దల ద్వారా పోలీసులకు సమాచారం ఇచ్చినట్లు తెలిపారు. ఇటీవల పోలీసు అధికారులు సంఘటన స్థలానికి చేరుకొని విచారించినట్లు గ్రామ పెద్దలు తెలిపారు. దర్యాప్తు చేసి నిందితులను గుర్తించాలని గ్రామస్థులు కోరుతున్నారు.

ట్రాక్టర్ డ్రైవర్‌పై కేసు నమోదు

వీణవంక, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చల్లూరు మానేరువాగు నుంచి అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్న ట్రాక్టర్ డ్రైవర్ శివరాత్రి బాపుపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ ఆవుల తిరుపతి తెలిపారు. ప్రభుత్వ అనుమతి లేకుండా ఇసుక రవాణా చేస్తే కఠినచర్యలు తప్పవని హెచ్చరించారు.

పోలీస్ స్టేషన్ భవనాన్ని ప్రారంభించిన సీపీ

శంకరపట్నం, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): శంకరపట్నం మండలంలో నూతన పోలీస్‌స్టేషన్ భవనాన్ని సోమవారం సీపీ గౌస్ ఆలం ప్రారంభించారు. ఈ సందర్భంగా పోలీస్‌స్టేషన్ ఆవరణలో మొక్కలు నాటారు. నూతన పోలీస్‌స్టేషన్‌లోని స్టేషన్‌హౌస్, ఆఫీసర్ రూమ్, రైటర్ రూమ్, రికార్డుల గది, రిసెప్షన్ కౌంటర్, వెయిటింగ్ హాల్ తదితర వాటిని పరిశీ లించారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కేశవపట్నం పోలీస్‌స్టేషన్ భవనం శిథిలావస్థకు చేరకోవడంతో పాత పోలీస్ స్టేషన్‌కు సమీపంలో ప్రజలకు అందుబాటులో ఉండే విధంగా అద్దె భవనంలోకి మార్చినట్లు తెలిపారు. సొంత భవనం నిర్మించే వరకు అద్దె భవనంలో సేవలు కొనసాగుతాయని, మండల ప్రజలు ఈ విషయాన్ని గమనించాలన్నారు. త్వరలో కొత్త పోలీస్‌స్టేషన్ నిర్మాణానికి ప్రతిపాదనలు పంపిస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఏసీపీ మాధవి, సీఐలు కరుణాకర్, వెంకట్, నిరంజన్, ఎస్ఐలు శేఖర్‌రెడ్డి, తిరుపతి, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.


శంకరపట్నంలో పోలీస్ స్టేషన్ భవనాన్ని ప్రారంభిస్తున్న సీపీ గౌస్ ఆలం

ఉత్తమ పోలీస్ డాగ్‌గా సింబా

కోల్‌సిటీ, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): వరంగల్ జిల్లా మమునూరు పీటీసీలో జరిగిన తెలంగాణ రాష్ట్ర రెండవ పోలీస్ డ్యూటీ మీట్‌లో కాళేశ్వరం జోన్ నుంచి నార్కోటిక్ డాగ్ విభాగం పోటీలో పాల్గొని గంజాయి, మత్తు పదార్థాలను గుర్తించడంలో పోలీసు జాగిలం సింబా, డాగ్ హ్యాండ్లర్ ఏఆర్ హెడ్ కానిస్టేబుల్ ఎం. వేణుగోపాల్ కృష్ణ గోల్డ్‌మెడల్ సాధించారు. రాష్ట్రస్థాయిలో ఉత్తమ పోలీస్‌డాగ్‌గా సింబా ఎంపికైంది. సోమవారం రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్‌ఝా నార్కోటిక్ డాగ్ సింబా, డాగ్ హాండ్లర్‌ను అభినందించారు. 2026ఫిబ్రవరిలో పూణేలో జరిగే నేషనల్ పోలీసు డ్యూటీమీట్‌లో పాల్గొని మరిన్నిపతకాలు సాధించాలని రాష్ట్రానికి, రామగుండం పోలీస్‌కమిషనరేట్‌కు పేరు తీసుకురావాలని తెలిపారు. మంచిర్యాల డీసీపీ ఏ భాస్కర్, పెద్దపల్లి డీసీపీ పీ కరుణాకర్, ట్రాఫిక్‌ఏసీపీ శ్రీనివాస్, ఏఆర్ ఏసీపీ ప్రతాప్, ఆర్ఐలు దామోదర్, శ్రీనివాస్, వామనమూర్తి సంపత్, మల్లేశం పాల్గొన్నారు.


పోలీస్ డాగ్ సింబాకు బంగారు పతకం బహూకరిస్తున్న సీపీ అంబర్ కిషోర్ ఝా

గొర్రెల దొంగలు పట్టివేత

కోనరావుపేట, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): కోనరావుపేట మండలం నిజామాబాద్ శివారులో గొర్రెలను చోరీచేసిన దొంగలను పోలీసులు పట్టుకున్నారు. కోనరావుపేట ఎస్సై ప్రశాంత్‌రెడ్డి తన సిబ్బందితో కలిసి సోమవారం వాహన తనిఖీలు నిర్వహిస్తుండగా, బెజ్జంకిమండలం కల్లేపల్లి గ్రామానికి చెందిన ఇద్దరు యువకులు బండి అశోక్, కెంగర్ల చందు అనుమానాస్పదంగా వాహనంపై ప్రయాణిస్తున్న విషయాన్ని గమనించి అదుపులోకి తీసుకున్నారు. విచారణలో వారు ఇటీవల ఇల్లంతకుంట, చందుర్తి, కోనరావుపేట పోలీస్‌స్టేషన్‌ల పరిధిలో గొర్రెలదొంగతనాలకు పాల్పడ్డట్లు ఒప్పుకున్నారు. వారి వద్ద నుంచి రెండు గొర్రెలు, రెండు గొర్రె పిల్లలు, ఒక పొట్టేలు, వారు ఉపయోగిస్తున్న ద్విచక్రవాహనాన్ని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. దొంగతనానికి గురైన మొత్తం విలువ సుమారు రూ.48వేలు. అలాగే మిగిలిన గొర్రెలను పత్రి నర్సింహులు అనే వ్యక్తికి రూ.50వేలకు అమ్మి, ఆ డబ్బును ఖర్చుచేశామని నిందితులు వెల్లడించారు. ఈ దొంగతనం కేసు ఛేదించిన ఎస్ఐతోపాటు, కానిస్టేబుళ్లు రవి,విశాల్, జగన్‌ను చందుర్తి సీఐ వెంకటేశ్వర్లు అభినందించారు.


నిందితులను అరెస్టు చూపుతున్న పోలీసులు

తహసీల్దార్‌పై చర్యలు తీసుకోవాలి

- **పురుగుల మందు డబ్బాతో ప్రజావాణికి వచ్చిన బాధిత కుటుంబం**
- **మందుడబ్బాను లాక్కున్న పోలీసులు**

సుభాష్‌నగర్, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): తాము కొనుగోలు చేసిన భూమిని కొందరు కబ్జాచేశారని, వారికి వత్తాసు పలుకుతున్న తహసీల్దార్‌పై చర్యలు తీసుకోవాలని బాధిత కుటుంబం డిమాండ్ చేసింది. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణికి పురుగుల మందుడబ్బాతో వచ్చింది. అక్కడేఉన్న పోలీసులు అతడినుంచి మందు డబ్బాను లాక్కున్నారు. బాధితుడు గంగాధర మల్లేశం వివరాల ప్రకారం.. గంగాధర మండలకేంద్రానికి చెందిన గంగాధర మల్లేశం మండలంలోని సర్వే నంబరు 94లో 34గుంటల భూమిని, అదే మండలంలోని లక్ష్మీదేవిపల్లికి చెందిన ఎండీ గౌస్ నుంచి కొనుగోలు చేశాడు. ఆ భూమిని 2011 డిసెంబరు 27న తన భార్య గంగాధర శాంతమ్మ పేరిట రిజిస్ట్రేషన్ చేయించుకున్నాడు. అప్పటి నుంచి ఆ భూమిలో కాస్తులో ఉన్నాడు. ఎండీ నజీర్ అనేవ్యక్తి అక్రమంగా తమ భూమిలో ప్రహరీ, రేకులషెడ్డు నిర్మించాడని, ఈ విషయాన్ని 2025 జూన్ 13న స్థానిక తహసీల్దార్‌కు ఫిర్యాదు చేశామని తెలిపాడు. చర్యలు తీసుకోవాలని తహసీల్దార్‌ను కోరగా తమను లక్ష రూపాయలు అడిగినట్లు ఆరోపించాడు. అందుకు నిరాకరించడంతో అక్కత తమకు భూమి లేదంటూ భయభ్రాం తులను చేశారని పేర్కొన్నాడు. ఈ విషయాన్ని గతనెల 27న ప్రజావాణిలో కలెక్టర్‌కు ఫిర్యాదు చేశామని, ఎలాంటి చర్యలూ తీసుకోలేదని ఆవేదన వ్యక్తం చేశాడు. విచారణ చేపట్టి తమకు న్యాయం చేయాలని కోరాడు.


పురుగుల మందు డబ్బాతో వచ్చిన బాధితుడు గంగాధర మల్లేశం

అంతర్‌జిల్లా దొంగ అరెస్టు

- **18 తులాల బంగారం, 164 తులాల వెండి, రూ.లక్ష నగదు స్వాధీనం**

కరీంనగర్ క్రైం, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ పోలీస్‌కమిషనరేట్ పరిధిలోని వివిధప్రాంతాల్లో చోరీలకు పాల్పడిన అంతర్‌జిల్లా దొంగతోపాటు, దొంగిలిచిన సొత్తు కొనుగోలుచేసిన వ్యక్తిని పోలీసులు అరెస్టు చేశారు. సోమవారం సీపీ గౌస్‌ఆలం కమిషనరేట్ కేంద్రంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. నిజామాబాద్ జిల్లా కమ్మర్ పల్లి (ప్రస్తుతం ఆర్మూర్ మండలం ఏసపల్లి)కి చెందిన టేకు చిరంజీవి(22) హార్వెస్టర్‌డ్రైవర్‌గా పనిచేసేవాడు. జల్సాలకు అలవాటుపడి సులువుగా డబ్బులు సంపాదించాలనే ఆలోచనతో దొంగతనాలకు పథకం వేశాడు. కరీంనగర్, నిజామాబాద్ జిల్లాలోని గ్రామాల్లో పగలంతా కారులో తిరిగి తాళంవేసి ఉన్న ఇళ్లను గుర్తించేవాడు. ఆ ఇళ్లను మరిచిపోకుండా ఉండేందుకు గూగుల్‌మ్యాప్ లొకేషన్ షేర్ చేసుకునేవాడు. అర్ధరాత్రి మ్యాప్ ద్వారా అక్కడికి చేరుకొని దొంగతనాలకు పాల్ప డేవాడు. ఇలా జిల్లాలోని షానగర్, గంగిపెల్లి, పోరండ్ల, బొమ్మనపల్లి, చీమలకుంటపల్లి, వెల్బూర్‌గ్రామాల్లో ఏడు దొంగతనాలు చేశాడు. దొంగిలించిన సొత్తును చిరంజీవి తండ్రి గంగసాయి నిజామాబాద్ నందిపేటలో బంగారం దుకాణం నిర్వహిస్తున్న కొండూరు గ్రామానికి చెందిన బంగారు నర్సయ్య(44)కు విక్రయించేవాడు. ఈ కేసులో చిరంజీవితోపాటు నర్సయ్యను అరెస్టుచేసినట్లు సీపీ తెలిపారు. నిందితుడివద్ద నుంచి 18తులాల బంగారం, 164తులాలవెండి, లక్షరూపాయల నగదును స్వాధీనం చేసుకున్నారు. నిందితుడికిచెందిన కారు, మొబైల్ ఫోన్, దొంగతనాలకు ఉపయోగించిన ఇనుపరాడ్లు, గ్లౌస్‌లు, మాస్కులు సీజ్ చేశారు.

నిందితుడిని పట్టుకునేందుకు కరీంనగర్ టౌన్ ఏసీపీ వెంకటస్వామి ఆధ్వర్యంలో తిమ్మాపూర్ సీఐ గడ్డం సదన్‌కుమార్, సీసీఎస్ సీఐ ప్రకాష్, ఎల్ఎండీ ఎస్సై శ్రీకాంత్, క్రైం పార్టీ కానిస్టేబుల్ నరేష్, జైపాల్, సీసీఎస్ కానిస్టేబుల్ రాజశేఖర్, వేణుగోపాల్, అనిల్, అవినాష్‌తో సీపీ ప్రత్యేకటీంలను ఏర్పాటు చేశారు. రంగంలోకి దిగిన పోలీసు టీంలు దొంగతనాలు జరిగినస్థలంలో సెల్‌ఫోన్ డంపును, టోల్‌ప్లాజా సీసీకెమెరాలను పరిశీలించి చోరీలకు పాల్పడిన నిందితుడిని అరెస్టుచేశారు. నిందితుడి నుంచి 18తులాల బంగారం, 164తులాలవెండి, లక్ష రూపాయలనుస్వాధీనం చేసుకున్నారు.నిందితుడి కారు, మొబైల్‌ఫోన్, దొంగతనాలకు ఉపయోగించిన ఇనుపరాడ్లు, గ్లౌస్‌లు, మాస్కులు సీజ్‌చేశారు. ఈసందర్భంగా సిబ్బందిని సీపీ అభినందించారు. సమావేశంలో టౌన్ ఏసీపీ వెంకటస్వామి, సీసీఎస్ ఏసీపీ జాన్‌నర్సింహులు, సీఐలుసదన్‌కుమార్,ప్రకాశ్ తదితరులు పాల్గొన్నారు.


స్వాధీనం చేసుకున్న బంగారు, వెండి ఆభరణాలు


దొంగలను అరెస్టు చూపుతున్న సీపీ గౌస్ ఆలం

ద్విచక్ర వాహనాలను ఢీకొన్న కారు

పెద్దపల్లి రూరల్, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గొళ్లపల్లి వద్ద రాజీవ్ రహదారిపై సోమవారం గోదావరిఖని వైపు నుంచి అతివేగంగా వస్తున్న కారు ద్విచక్రవాహనాలను ఢీకొంది. ఈ ఘటనలో నలుగురు యువకులకు తీవ్ర గాయాలైనట్లు స్థానికులు తెలిపారు. గాయాలపాలైన యువకులను పెద్దపల్లి ఆసుపత్రికి తరలించగా మెరుగైన వైద్యం కోసం కరీంనగర్ తరలించారు. కారులోగల వ్యక్తికి గాయాలైనట్లు స్థానికులు తెలిపారు. సంఘటనపై ఎలాంటి ఫిర్యాదులు రాలేదని పోలీసులు పేర్కొన్నారు.

గంజాయి విక్రయిస్తున్న వ్యక్తి అరెస్టు

కోరుట్ల, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): కోరుట్ల పట్టణ శివారులోని పశువైద్య కళాశాల సమీపంలో గంజాయి విక్రయిస్తున్నారన్న సమాచారంతో తనిఖీలు చేసి పయాజుల్ రెహమాన్ అనే వ్యక్తి ని సోమవారం అరెస్టు చేసినట్లు ఎస్ఐ చిరంజీవి తెలిపారు. మరో వ్యక్తి పరారైనట్లు ఎస్ఐ పేర్కొన్నారు. పయాజుల్ రెహమాన్ కోరుట్ల పట్టణంలోని అర్బన్ కాలనీకి చెందిన వాడిగా గుర్తించినట్లు ఎస్ఐ తెలిపారు. అతడి వద్ద 150 గ్రాముల గంజాయి స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. గంజాయితో పాటు ఫయాజుల్ రెహమాన్ ఉపయోగిస్తున్న సెల్‌ఫోన్‌ను స్వాధీనం చేసుకోని కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్ఐ పేర్కొన్నాడు. మరో వ్యక్తి కోసం గాలిస్తున్నామన్నారు.

గంజాయి విక్రయిస్తున్న ఇద్దరి అరెస్ట్


గంజాయి విక్రయించిన వారిని అరెస్టు చూపుతున్న సీఐ మొగిలి

తంగళ్లపల్లి, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): తంగళ్లపల్లి మండల కేంద్రంలో గంజాయి విక్రయిస్తున్న ఇద్దరిని అరెస్ట్ చేసినట్లు సీఐ మొగిలి తెలిపారు. గ్రామశివారులో స్మశాన వాటిక వద్ద గంజాయి విక్రయిస్తున్న బద్దెనపల్లి గ్రామానికిచెందిన ఎండీ సాదిక్, తంగళ్లపల్లికి చెందిన రాజేష్‌ను అదుపులోకి తీసుకున్నారు. వారివద్ద నుంచి 120 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. చాకచక్యంగా వ్యవహరించి పట్టుకున్న ఎస్ఐ ఉపేంద్రచారి, యేసయ్య, రవిందర్, కానిస్టేబుల్స్ నరేందర్, ప్రశాంత్, శ్రీకాంత్, సందీప్, అబ్బాస్ అలీ, రామ్మోహన్‌లను సీఐ అభినందించారు.

అక్రమ ఇసుక డంపులు సీజ్

వీణవంక, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పోతిరెడ్డిపల్లి గ్రామ శివారులో సర్వేనం 222గల భూమిలో అక్రమంగా నిలువచేసిన ఇసుకడంపులను రెవెన్యూ అధికారులతోకలిసి పోలీస్‌లు సీజ్ చేశారు. అక్రమంగా నిలువఉన్న 96ట్రిప్పుల ఇసుకను సీజ్‌చేసినట్టు ఎస్ఐ ఆవుల తిరుపతి తెలిపారు.



మల్లాపూర్‌లోని సోమేశ్వరస్వామికి వరద పాశం సమర్పిస్తున్న భక్తులు

సోమేశ్వర కొండపై వరద పాశం

మల్లాపూర్, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రం సమీపంలోని సోమేశ్వర కొండపై సోమవారం వరద పాశం నిర్వహించారు. భక్తులు భక్తి శ్రద్ధలతో తయారు చేసిన వరదపాశాన్ని తల పెట్టుకుని కొండపైకి తరలివచ్చారు. స్వామి వారికి పూజల అనంతరం వరదపాశాన్ని సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. శ్రావణ సోమవారం సందర్భంగా సోమేశ్వర స్వామిని దర్శించుకోవడానికి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. శివలింగానికి పంచామృతాలతో అభిషేకాలు చేసి రంగుల పూలతో అలంకరించి శివుడికి బిల్వపత్రిని సమర్పించారు. ఈ సందర్భంగా టీపీసీసీ డెలిగేట్ సభ్యుడు కల్వకుంట్ల సుజిత్‌రావు, మెట్‌పల్లి ఏఎంసీ ఛైర్మన్, నాయకులు స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు.



శుభలేఖ పంపండి..

శ్రీవారి దీవెనలు పొందండి

కరీంనగర్ కల్చరల్, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): వధూవరులకు తిరుమల శ్రీవారి, అమ్మవార్ల ఆశీస్సులు అందితే అంతకంటే కావాల్సింది ఏముంటుంది.. టీటీడీ భక్తులకు ఇటువంటి అవకాశం కల్పించింది. వధూవరులు పూర్తి చిరునామాతో కూడిన వివాహ శుభలేఖను నెల రోజుల ముందు కార్యనిర్వహణాధికారి, టీటీడీ పరిపాలనా విభాగం, కేటీ రోడ్, తిరుపతి-517501 చిరునామాకు పంపాలి. అక్కడి శుద్ధ ప్రతి విభాగం వారు శ్రీవారి అక్షింతలు, కుంకుమ, కంకణాలు, వేంకటేశ్వర స్వామి- పద్మావతి అమ్మవార్ల ఫొటోలతో కూడిన పత్రిక, కల్యాణ సంస్కృతి పుస్తకాన్ని శుభలేఖను పంపించిన వారి అడ్రస్‌కు పంపుతారు.



భక్తులతో కిక్కిరిసిన రాజన్న ఆలయ ఆవరణ

రాజన్న ఆలయంలో శ్రావణ శోభ

దర్శించుకున్న 50 వేల మంది భక్తులు

వేములవాడ కల్చరల్, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): శ్రావణమాసం రెండవ సోమవారం సందర్భంగా వేములవాడ రాజరాజేశ్వరస్వామి వారి ఆలయం భక్తజన సంద్రంగా మారింది. సుమారుగా 50 వేల మంది వరకు భక్తులు తరలివచ్చి శ్రీరాజరాజేశ్వర స్వామి వారిని దర్శించుకుంటున్నట్లు ఆలయాధికారులు అంచనా వేస్తున్నారు. భక్తులు తెల్లవారుజామున ధర్మగుండంలో స్నానాలు ఆచరించి కల్యాణకట్టలో తలనీలాలు సమర్పించుకుని కోడెమొక్కు, ధర్మ దర్శనం క్యూలైన్‌లలో బారులు తీరారు. కోడెమొక్కు చెల్లించుకునేందుకు భక్తులు సుమారుగా నాలుగు గంటల పాటు క్యూలైన్‌లో నిరీక్షించినట్లు తెలిపారు. మహిళలు శ్రీరాజరాజేశ్వరీ దేవి అమ్మవారికి నూతన వస్త్రాలు అందజేసి ఒడిబియ్యం పోసి మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయం ముందు రావి చెట్టు కింద దీపాలు వెలిగించి పిల్లపాపలు, పాడిపంటలు చల్లంగా ఉండేలా దీవించమని ప్రార్థించారు. భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా ఆలయ ఈవో రాధా బాయి ఆధ్వర్యంలో ఏఈవోలు బ్రహ్మన్నగారి శ్రీనివాస్, శ్రావణ్‌కుమార్, అశోక్‌కుమార్‌లు అధికారులు శ్రీనివాసచారి, రాజేందర్, నరేందర్ క్యూలైన్‌లు త్వరితగతిన కదిలేలా చర్యలు చేపట్టారు.



ఘనంగా మహాలింగార్చన

శ్రావణ మాసం రెండో సోమవారం సందర్భంగా రాజరాజేశ్వర స్వామి వారికి ఆలయ అర్చకులు ఉదయం ప్రత్యేక పూజలు చేపట్టారు. స్వామివారికి ఉదయం 5.30 గంటల నుంచి మహాన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకం వేదమంత్రోచ్చరణ మధ్య ఘనంగా నిర్వహించారు. సాయంత్రం 6.30 గంటలకు స్వామివారి కల్యాణ మంటపంలో మహా లింగార్చన చేపట్టారు. దీపాలను లింగాకారంలో వెలిగించిన భక్తులు మొక్కులు చెల్లించకున్నారు.

ధర్మపురిలో ప్రత్యేక పూజలు



ధర్మపురి గోదావరిలో భక్తుల పుణ్యస్నానాలు

ధర్మపురి: ధర్మపురి క్షేత్రంలో సోమవారం శ్రావణ సందడి నెలకొంది. లక్ష్మీనరసింహస్వామి, అనుబంధ అక్కపెల్లి రాజరాజేశ్వర స్వామి ఆలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ వేద పండితులు, అర్చకులు శివాలయాల్లో స్వామి వారలకు మహాన్యాస పూర్వక రుద్రాభిషేకం, ప్రత్యేక పూజలు, అన్నపూజ, హారతి కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయ ఈవో సంకటాల శ్రీనివాస్, ఆలయ ధర్మకర్తల మండలి ఛైర్మన్ జక్కు రవీందర్, ధర్మకర్తలు, సిబ్బంది భక్తులకు తగు సేవలు అందించారు. ఆలయ వేద పండితులు పాలెపు ప్రవీణ్‌కుమార్‌శర్మ, బూస ప్రవీణ్ కుమార్, జన్మంచి శ్రీనివాస్, ద్యావళ్ల విశ్వనాథశర్మ, సాయికుమార్ పాల్గొన్నారు.

కోటిలింగాలలో...

వెల్గటూర్: వెల్గటూర్ మండలంలోని కోటిలింగాలలో సోమవారం శ్రావణ సందడి నెలకొన్నది. కోటిలింగాల గోదావరి నదిలో పుణ్యస్నానాలు ఆచరించిన భక్తులు కోటేశ్వర స్వామిని దర్శించుకున్నారు. స్వామి వారికి అర్చనలు, అభిషేకాదులు నిర్వహించారు. అర్చకులు భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేసి వారిని ఆశీర్వదించారు.

చక్కని మొక్కల బడి

- మొక్కలు నాటిస్తూ.. మార్కులు వేస్తూ ప్రోత్సాహం
- బడి సంచి భారం తగ్గించేందుకు చర్యలు
- ఒద్యారం పాఠశాలలో నూతన ఒరవడి



ఆహ్లాదకరంగా పాఠశాల ఆవరణ



గంగాధర, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): గంగాధర మండలం ఒద్యారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పచ్చని చెట్ల మధ్య ఆహ్లాదకర వాతావరణంలో ఉంటుంది. ఎటు చూసినా మొక్కలే కనిపిస్తాయి. పాఠశాల ప్రారంభం కాగానే విద్యార్థులు వచ్చి బ్యాగులు తరగతి గదిలో పెట్టి మొక్కల వద్దకు వెళతారు. ఎందుకంటే వాటిని విద్యార్థులే నాటారు. వాటి సంరక్షణ బాధ్యత వారిదే.. మొక్కలు నాటి సంరక్షించినందుకు వారికి ఉపాధ్యాయులు మార్కులు వేస్తారు. ఆ పాఠశాల విద్యార్థులకు పాఠశాల బ్యాగు భారం తగ్గింది. నిబంధనలు అనుసరించి బ్యాగు బరువును పరిమితం చేసేందుకు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ప్రభాకర్‌రావు ప్రత్యేక చర్యలు తీసుకున్నారు. ఆయనకు ప్రభుత్వం ఇన్‌చార్జి ఎంఈవోగా బాధ్యతలు అప్పజెప్పడంతో మండల వ్యాప్తంగా ఈ విధానాన్ని అమలు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నారు.

మొక్కలు నాటి.. సంరక్షించి..

ఒద్యారం పాఠశాలలో విద్యార్థులతో మొక్కలు నాటిస్తున్నారు. వాటి సంరక్షణ బాధ్యతలు వారికే అప్పజెప్పి అందుకు మార్కులు వేస్తున్నారు. దీంతో విద్యార్థులు మొక్కలపై ప్రత్యేక శ్రద్ధ చూపి వాటిని సంరక్షిస్తున్నారు. మూడేళ్ల క్రితం పాఠశాల ఆవరణలో 30 మొక్కలుండేవి. ప్రస్తుతం 280కి చేరింది. పాఠశాలలో ఆరవ తరగతిలో చేరిన ప్రతి విద్యార్థి పండ్ల మొక్కను నాటాల్సి ఉంటుంది. ఆ మొక్క శాస్త్రీయ నామం, విద్యార్థి పేరు, తరగతి, నాటిన సంవత్సరం వంటి వివరాలు నమోదు చేస్తున్నారు.

రెండేళ్లుగా మొక్కలను పెంచుతున్న..

శాన్వి, ఎనిమిదో తరగతి



పాఠశాలలో చేరినప్పుడు జామ మొక్కలను నాటాను. ఆరో తరగతిలో నాటిన మొక్కకు నిత్యం పాఠశాల ఆటల పీరి యడ్, విరామ సమయంలో నీరు పోస్తూ, పిచ్చి మొక్కలను తొలగిస్తున్నాను. మొక్కను నాటిన సంవత్సరం, ఎవ్వరు నాటింది, ఏ రకం మొక్క నాటారనేది ఉపాధ్యాయులు ఒక స్టిక్కర్‌లో వివరాలను నమోదు చేస్తారు. దానిని మొక్కకు కట్టిస్తున్నారు స్కాన్ చేయగానే వివరాలు మొత్తం ఆన్‌లైన్‌లో కనిపిస్తున్నాయి.

బ్యాగు బరువు తగ్గింది

శ్రావ్య, ఎనిమిదో తరగతి



గతంలో బడి బ్యాగు నిండా పుస్తకాలతో భారంగా ఉండే ది. ఈ విద్యాసంవత్సరం నుంచి పాఠశాల ఉపాధ్యాయులు బ్యాగు బరువును తగ్గించారు. దీంతో మెడ నొప్పి, నడుం నొప్పి పోయింది. అవసరం లేని పుస్తకాలు, నోటుబుక్స్ పాఠ శాల డెస్క్‌లో దాచిపెట్టుకుంటున్నాను.

ఆలా నాటిన ప్రతి విద్యార్థికి సంవత్సరంలో అన్ని సబ్జెక్టులకు కలిపి 10 మార్కులు కలుపుతూ ప్రోత్సహిస్తున్నారు. ప్రతి శనివారం నోబ్యాగ్ డే అమలు చేస్తున్నారు. నాలుగవ శనివారం సందేశాత్మక చలన చిత్రాలు ప్రదర్శిస్తున్నారు. ఉపాధ్యాయులు కృషితో ఈ పాఠశాలలో చదివిన తొమ్మిదో తరగతి విద్యార్థిని సహస్ర ఎన్‌ఎంఎంఎస్ స్కాలర్ షిప్‌నకు ఎంపికైంది.

'విద్యావాహిని'తో రాష్ట్ర వ్యాప్తంగా గుర్తింపు

ఇన్‌చార్జి ఎంఈవోగా ఉన్న ప్రభాకర్‌రావు ఈ విద్యా సంవత్సరం ప్రారంభంలో విద్యావాహిని పేరుతో ప్రత్యేకంగా వాహనాన్ని ఏర్పాటు చేసి ప్రభుత్వ పాఠశాలల్లో సౌకర్యాలపై మండల వ్యాప్తంగా విస్తృతంగా ప్రచారం చేశారు. ఆయన కృషి ఫలించి మండల వ్యాప్తంగా ఉన్న ప్రభుత్వం పాఠశాలల్లో 629 మంది విద్యార్థులు చేరారు. ఈ విషయం తెలుసుకున్న అధికారులు, ప్రజాప్రతినిధులు ప్రభాకర్‌రావును అభినందించారు.



పుస్తకాల సంచిని తూకం వేయిస్తున్న ప్రధానోపాధ్యాయుడు ప్రభాకర్‌రావు

విద్యార్థుల ఇబ్బందిని గమనించి..

ఒద్యారం పాఠశాలలో ప్రస్తుతం 97 మంది విద్యార్థులు చదువుతున్నారు. వారందరూ కిలోల కొద్దీ బరువున్న పుస్తకాల సంచిని మోయలేక ఇబ్బందిపడేవారు.. చిన్న తరగతుల నుండి పెద్ద తరగతుల వరకు బరువైన బ్యాగులను మోయలేక పోయేవారు. గమనించిన ప్రధానోపాధ్యాయుడు ప్రభాకర్‌రావు పుస్తకాల సంచి బరువును తగ్గించేందుకు చర్యలు తీసుకున్నారు. అవసరమున్న పుస్తకాలను ఇంటికి తీసుకెళ్లేలా.. మిగతావి పాఠశాలలోని డెస్కుల్లో పెట్టుకునేందుకు చర్యలు తీసుకున్నారు. కేంద్ర ప్రభుత్వం నిబంధనల ప్రకారం స్కూల్ బ్యాగ్ ఐదు కిలోలు మించి ఉండకూడదు. ప్రతి విద్యార్థి బ్యాగును తూకం వేయించి నిబంధనల మేరకు బరువు ఉండేలా చర్యలు తీసుకుంటున్నారు. ప్రభాకర్‌రావు ఇన్‌చార్జి ఎంఈవోగా బాధ్యతలు నిర్వహిస్తుండడంతో గంగాధర మండల వ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాల్లో పుస్తకాల సంచుల బరువు తగ్గించేందుకు చర్యలు తీసుకుంటున్నారు. ఈ విషయం తెలుసుకున్న చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం ప్రభాకర్‌రావును ప్రత్యేకంగా అభినందించారు. ఈ విధానంతో ప్రస్తుతం విద్యార్థులకు బ్యాగు బరువు తగ్గి శారీరకంగా ఉపసమనం లభించింది.



పచ్చని చెట్లతో పాఠశాల ఆవరణ



కరీంనగర్‌లో కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న మంత్రి పొన్నం ప్రభాకర్

కార్యాలయాన్ని సద్వినియోగం చేసుకోవాలి

మంత్రి పొన్నం ప్రభాకర్ క్యాంపు కార్యాలయం ప్రారంభం

కరీంనగర్ అర్బన్, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కార వేదికగా ప్రారంభించిన కార్యాలయాన్ని వినియోగించుకోవాలని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ విజ్ఞప్తి చేశారు. కరీంనగర్ మంకమ్మతోటలోని పొన్నం కాంప్లెక్స్‌లో మంత్రి సోమవారం క్యాంపు కార్యాలయాన్ని ప్రారంభించారు. కుటుంబ సభ్యులతో కలిసి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ప్రజా పాలన ప్రభుత్వంలో హుస్నాబాద్ శాసనసభ్యుడిగా, కరీంనగర్ మాజీ పార్లమెంట్ సభ్యుడిగా లోక్‌సభ నియోజకవర్గం పరిధిలో ప్రజలకు అందుబాటులో ఉండాలనే ఉద్దేశంతో నూతన కార్యాలయాన్ని ప్రారంభించినట్లు చెప్పారు. కార్యాలయంలో అర్జీలు, విజ్ఞాపన పత్రాలు, సీఎం సహాయనిధి, ఇతర దరఖాస్తుల స్వీకరణ, ప్రభుత్వ సంక్షేమ పథకాల సమాచారం అందుబాటులో ఉంటుం దన్నారు. కార్యక్రమంలో కరీంనగర్ పార్లమెంట్ కాంగ్రెస్ ఇన్‌చార్జి వెలిచాల రాజేందర్‌రావు, జిల్లా కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కోమటిరెడ్డి పద్మాకర్‌రెడ్డి, ఆర్టీఏ మెంబర్ పడాల రాహుల్, నాయకులు ఆకారపు భాస్కర్‌రెడ్డి, పడాల రాహుల్, గడ్డం విలాస్‌రెడ్డి, వైద్యుల అంజన్ కుమార్, పులి ఆంజనేయులుగౌడ్, కర్ర సత్యప్రసన్నరెడ్డి, మడుపు మోహన్, మల్యాల సుజిత్, ఎండీ తాజ్, శ్రావణ్ నాయక్, బోనాల శ్రీనివాస్, కంకణాల అనిల్‌కుమార్, ఎస్‌ఏ మోసీన్, ముద్దం తిరుపతి, ఎస్‌ఎల్ గౌడ్, తాళ్లపెల్లి శ్రీనివాస్‌గౌడ్, ఆకుల ప్రకాష్, పడిశెట్టి భూమయ్య, కట్ల సతీష్ పాల్గొన్నారు.

పోటీపరీక్షల్లో రాణించేలా

విద్యార్థులను సన్నద్ధం చేయాలి

గురుకుల సొసైటీ కార్యదర్శి అలుగు వర్షిణి



సైనిక్ స్కూల్‌ను పరిశీలిస్తున్న అలుగు వర్షిణి

చొప్పదండి, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): రాబోయే ఎన్‌డీఏ, ఐఐటీ, జేఈఈ పరీక్షలకు విద్యార్థులను సన్నద్ధం చేయాలని రాష్ట్ర సాంఘిక సంక్షేమ గురుకుల సొసైటీ కార్యదర్శి అలుగు వర్షిణి అన్నారు. సోమవారం మండలంలోని రుక్మాపూర్ సాంఘిక సంక్షేమ గురుకుల సైనిక్‌స్కూల్‌ను ఆమె తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులకు ఇబ్బందులు కలగకుండా అన్నిచర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

ఎన్‌డీఏ పోటీ పరీక్షలకు విద్యార్థులు అర్హత సాధించేలా ప్రత్యేక శిక్షణకు చొరవచూపాలని అన్నారు. ఎన్‌డీఏ శిక్షణకు సంబంధించిన, వ్యాయామ, యోగా, డ్రిల్, రన్నింగ్, వివిధ క్రీడాఅంశాలను పరిశీలించారు. కోచ్‌లు, ఆర్మీ సిబ్బందితో మాట్లాడి పలుసూచనలు చేశారు. ఆమెవెంట స్పెషల్ ఆఫీసర్ ఎం భీమయ్య, ప్రిన్సిపాల్ జి కాళహస్తి, వైస్ ప్రిన్సిపాల్స్ కె శ్రీనివాస్, సీహెచ్ ప్రమోద్, సూపరింటెండెంట్ జె రమేష్, ఆర్మీసిబ్బంది, కోచ్‌లు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కాళేశ్వరం పాపాల చిట్టాను డైవర్ట్ చేసేందుకే

బీఆర్ఎస్ చలో కన్నెపల్లి

రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ సంక్షేమ శాఖమంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్



మాట్లాడుతున్న మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్

తిమ్మాపూర్, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): కాళేశ్వరం ప్రాజెక్టుకు సంబంధించిన పాపాల చిట్టా బయటపడుతుండటంతో దాన్ని డైవర్ట్ చేసేందుకే బీఆర్ఎస్ చలో కన్నెపల్లి కార్యక్రమం చేపట్టిందని రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ సంక్షేమ శాఖమంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ విమర్శించారు. సోమవారం కరీంనరగ్ జిల్లా అలుగునూర్‌లో ఆయన మీడియాతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాళేశ్వరం కమిషన్ నివేదికలో బీఆర్ఎస్ చేసిన పాపాల చిట్టా బయటపడిందన్నారు. మాజీ మంత్రి జగదీశ్వర్‌రెడ్డిపై ఎమ్మెల్సీ కవిత చేసిన వ్యాఖ్యలు యదార్థముందన్నారు. కవిత తన సోదరిలాంటిదని, ఇంటి గుట్టు అంత బయటపెట్టిందని అన్నారు. వారి కుటుంబంలో అనేక సమస్యలు ఉన్నాయని, అవి వారి వ్యక్తిగత విషయమని తెలిపారు. కాళేశ్వరం కమిషన్ నివేదికపై కేబినెట్‌లో చర్చిస్తా మన్నారు. వారు చేసిన పాపాలను త్వరలో ప్రజల ముందు పెడతామన్నారు. రాష్ట్రం ప్రభుత్వం రాజ్యాంగ పరంగా, చట్ట పరంగా బీసీలకు 42శాతం రిజర్వేషన్ కోసం చట్టం చేసి కేంద్రానికి పంపించామన్నారు. స్థానిక సంస్థల ఎన్నికలను ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా రిజరేషన్లు అమలు చేసి నిర్వహిస్తామని తెలిపారు.

జాగృతి మ్యాక్స్ పాలకవర్గానికి

మూడేళ్ల జైలు శిక్ష



సిరిసిల్ల క్రైం, ఆగస్టు 3(ఆంధ్రజ్యోతి): నేత కార్మికులను, మరో వైపు ప్రభుత్వాన్ని మోసం చేసిన సిరిసిల్ల పట్టణంలోని జాగృతి మ్యాక్స్ పాలకవర్గానికి కోర్టు మూడేళ్ల జైలు శిక్ష విధించింది. సొసైటీ అధ్యక్షుడు కొండ బత్తిని మల్లేశం, ఉపాధ్యక్షులు బొల్లబత్తి లక్ష్మినారాయణ, కార్యదర్శి కట్ల శ్రీనివాస్, డైరెక్టర్‌లు చింతకింది సత్యం, బొడ్డు గోపాల్‌లకు మూడేళ్ల కఠిన కారాగార జైలు శిక్షతో పాటు ఒక్కొక్కరికి రూ. 5వేల జరిమానా విధిస్తూ సిరిసి ల్ల ప్రథమ శ్రేణి న్యాయమూర్తి ప్రవీణ్ సోమవారం తీర్పు వెల్లడించారని సిరిసిల్ల టౌన్ సీఐ కృష్ణ తెలిపారు.

సిరిసిల్లలో నేత కార్మికులకు పనికల్పించి ఆదుకోవాలని జాగృతి మ్యాక్ సొసైటీకి ప్రభుత్వం బాధ్యతలు అప్పగించింది. ఈ పాలకవర్గం నిబంధనలకు విరుద్ధంగా స్థానిక నేతకార్మికులతో బట్టలను నేయించకుండా బయట నుంచి కొనుగోలు చేసి ప్రభుత్వానికి విక్రయిస్తున్నారు. ఇందులో భాగంగా చేనేత, జౌళిశాఖ ఏడి అశోక్‌రావు మే 29, 2017న గోదాంలో తనిఖీ నిర్వహించారు. ఈ తనిఖీల్లో రూ. 13లక్షల సరుకు ను సీజ్ చేశారు. జాగృతి మ్యాక్ సొసైటీ సభ్యులు అధిక లాభాలు పొందాలని ఓ వైపు ప్రభుత్వాన్ని మరోవైపు నేత కార్మికులను మోసం చేయడంతో గమనించిన ఏడీ సిరిసిల్ల పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు అప్పటి ఎస్‌ఐ రవి కేసు నమోదుచేసి కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశారు. ఈ కేసులో సిఎంఎస్ ఎస్‌ఐ శ్రావణ్ ఆధ్వర్యంలో కానిస్టేబుల్ నరేశ్ 10మంది సాక్షులను కోర్టులో హాజరు పరచగా పిపి సందీప్ వాదనలు వినిపించారు. కేసు పూర్వాపరాలను పరిశీలించిన న్యాయమూర్తి ప్రవీణ్ నేరస్థులకు మూడేళ్ల కఠిన కారాగార శిక్ష, ఒక్కొక్కరికి రూ. 5వేల జరిమానా విధించారు.

రాష్ట్రస్థాయి జూడో పోటీలకు కొత్తపల్లి విద్యార్థులు

భగత్‌నగర్, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): వరంగల్‌లో ఈ నెల 5 నుంచి 7వ తేదీ వరకు నిర్వహించనున్న రాష్ట్రస్థాయి జూడో పోటీలకు కొత్తపల్లి జడ్పీహెచ్‌ఎస్ విద్యార్థులు ఎంపికయ్యారు. పాఠశాలకు చెందిన నాగ శరణ్య, అంజలి, వర్షిని, సుశాంత్, ఇర్ఫాన్, ఎస్.శివ వివిధ విభాగాల్లో పాల్గొంటారని పాఠశాల హెచ్‌ఎం పద్మశ్రీ తెలిపారు. గత నెల 27న కరీంనగర్ స్పోర్ట్స్ స్కూల్‌లో నిర్వహించిన జిల్లాస్థాయి పోటీల్లో ప్రతిభ కనబరిచినట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులను కొత్తపల్లి మాజీ మున్సిపల్ ఛైర్మన్ రుద్ర రాజు, హెచ్‌ఎం, పీడీ ఎల్.వెంకటరమణ, ఉపాధ్యాయులు విద్యాసాగర్‌రావు, జూడో అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు వినయ్, దామోదర్, ఉపాధ్యాయులు అభినందించారు.



విద్యార్థులను అభినందిస్తున్న సిబ్బంది

యూరియా కోసం రైతుల కష్టాలు



పీఏసీఎస్ కార్యాలయం ఎదుట రైతులు

హుజూరాబాద్, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): యూరియా కోసం అన్నదాతలు కష్టాలు పడుతున్నారు. హుజూరాబాద్‌లోని ప్రాథమిక వ్యవసాయసహకార సంఘానికి యూరియా రాగా రైతులు బారులుదీరారు. రైతుకు రెండు బస్తాల చొప్పున అందజేశారు. డివిజన్‌కు సుమారు 22వేల మెట్రిక్‌టన్నులు అవసరం ఉండగా 13వేల మెట్రిక్ టన్నుల యూరియా దిగుమతి అయ్యిందని హుజూరాబాద్ ఏడీఏ సునీత తెలిపారు. దశల వారీగా యూరియా వస్తుందని, రైతులు ఆందోళన చెందవద్దని అన్నారు.

ఆలయాల అభివృద్ధికి సహకరిస్తా

● మంత్రి పొన్నం ప్రభాకర్

కరీంనగర్ కల్చరల్, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి) : స్థానిక జడ్పీ క్వార్టర్స్ ఆవరణలోని అయ్యప్ప ఆలయంతోపాటు ఇతర ఆలయాల అభివృద్ధికి తన వంతు సహకారం అందిస్తానని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. సోమవారం ఆలయంలో శిలాఫలకం, సీతారామ కల్యాణమండపాన్ని ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ చైర్మన్, ఈవో, ధర్మకర్తల మండలి నేతృత్వంలో దాతల సహకారంతో ఆలయాన్ని అభివృద్ధి చేస్తున్నారని అభినందించారు. కాంగ్రెస్ నాయకులు వెలిచాల రాజేందర్‌రావు, ఆకారపు భాస్కర్‌రెడ్డి, గడ్డం విలాస్‌రెడ్డి, పద్మాకర్‌రెడ్డి, వైద్యుల అంజన్ కుమార్, పొన్నం రవిచంద్ర, దేవాదాయశాఖ సహాయ కమిషనర్ నాయిని సుప్రియ, ఎగ్జిక్యూటీవ్ ఇంజనీర్ రాజేశ్, ఏఈ సంతోష్, ఆలయ చైర్మన్ వై.అనిల్‌కుమార్, ఈవో కొన్న కాంతారెడ్డి, ధర్మకర్తలు సత్యనారాయణ, శ్రీనివాస్, కవిత, కృష్ణ, ఆనందరెడ్డి పాల్గొన్నారు.



కల్యాణమండపాన్ని ప్రారంభిస్తున్న మంత్రి పొన్నం ప్రభాకర్

వైద్య సేవలు మెరుగయ్యేదెన్నడు?

(5వ పేజీ తరువాయి)

దించడానికి అవసరమైన సూపర్ స్పెషలిస్టు డాక్టర్లు, ఇతర వైద్యులు, సాంకేతిక సిబ్బందిని నియమించాల్సి ఉన్నది.

● మంత్రులు చొరవ తీసుకుంటేనే..

ఉమ్మడి కరీంనగర్, ఆదిలాబాద్ జిల్లాల పరిధిలో ఉన్న మంత్రులు దృష్టి సారించి సూపర్ స్పెషాలిటీ వైద్యుల నియామకానికి చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. ప్రభుత్వం సూపర్ స్పెషాలిటీ నిపుణలకు ప్రభుత్వం ఇస్తున్న వేతనం తక్కువగా ఉన్నందన డాక్టర్లు ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఉద్యోగం చేయడానికి ఆసక్తి చూపించడం లేదు. ప్రభుత్వం ఈ విషయంపై దృష్టి సారించాలని ప్రజలు కోరుతున్నారు.

● సంక్షిప్తంగా..

కరీంనగర్ టౌన్: నగరంలోని బీట్ మార్కెట్, గ్రేవీయార్డు శ్మశానవాటికను కొందరు కబ్జా చేశారని, వెంటనే కాపాడాలని మాజీ కార్పొరేటర్ కుర్ర తిరుపతి సోమవారం నగరపాలక సంస్థ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్‌కి వినతిపత్రం అందజేశారు.

హుజూరాబాద్ రూరల్: మండలంలోని కనుకులగిద్దెలో ఇఫ్కో కంపెనీ ఆధ్వర్యంలో నానోయూరియాతో కలిగే ప్రయోజనాలను ఏడీఏ సునీత వివరించారు.

జమ్మికుంట: జమ్మికుంట పట్టణంలోని మైనార్టీగురుకుల(బాలికల) పాఠశాలలో వావి లాల పీహెచ్‌సీ డాక్టర్ సంధ్యారాణి ఆధ్వర్యంలో వైద్యశిబిరం ఏర్పాటు చేశారు.

ఇల్లందకుంట: విద్యారంగ, ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి మంగళవారం కలెక్టరేట్ వద్ద ధర్నా చేయనున్నట్లు ఉపాధ్యాయసంఘాల పోరాట కమిటీ తెలిపింది.

హుజూరాబాద్: పట్టణంలోని సిటీ సెంట్రల్ హాల్‌లో ఈనెల8న గద్దర్ రెండో వర్ధంతి సభను విజయవంతం చేయాలని తెలంగాణ సాంస్కృతిక సమాఖ్య ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు శనిగరం బాబ్జీ అన్నారు.

జమ్మికుంట రూరల్/ఇల్లందకుంట : జమ్మికుంట పట్టణంలోని గాంధీ ఇల్లందకుంట మండల కేంద్రంలోని ప్రధాన కూడలి వద్ద కేడీసీసీ బ్యాంకు వైస్‌చైర్మన్ పింగిలి రమేష్ జన్మదిన వేడుకలను సోమవారం నిర్వహించారు.

జమ్మికుంట: రాష్ట్ర కాంగ్రెస్ ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్‌ను కాంగ్రెస్ నాయకులు పూదరి శివకుమార్‌గౌడ్ సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు.

ఇల్లందకుంట: మండలంలోని మర్రివాని పల్లెను మల్లారెడ్డి యూనివర్సిటీకి చెందిన వ్యవసాయ విద్యార్థులు సందర్శించారు.

శంకరపట్నం: శంకరపట్నం ఎంఈవోపై శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని సోమవారం ప్రజావాణిలో ఫిర్యాదు చేసినట్లు పీడీఎస్‌యూ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు అంగిడికుమార్ తెలిపారు.

శంకరపట్నం: ఇంటి నిర్మాణానికి అనుమతి ఇప్పించాలని శంకరపట్నం మండలం కరీంపేటకు చెందిన వనపర్తి రజిని ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు.

మలేరియా, డెంగ్యూపై అప్రమత్తంగా ఉండాలి



వివరాలు తెలుసుకుంటున్న రవీందర్ నాయక్

మానకొండూర్, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): మలేరియా, డెంగ్యూపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తెలంగాణ ప్రజారోగ్య కుటుంబ సంక్షేమశాఖ డైరెక్టర్ డాక్టర్ రవీందర్ నాయక్ సూచించారు. మానకొండూర్‌లోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సోమవారం సందర్శించారు. పీహెచ్‌సీలోని ఆపరేషన్ థియేటర్, గదులను పరిశీలించారు. ప్రజలకు నాణ్యమైన వైద్యాన్ని అందించాలని ఆయన తెలిపారు. డీఎంహెచ్‌వో వెంకటరమణ, అదనపు డీఎంహెచ్‌వో రాజగోపాల్, ప్రోగ్రామ్ అధికారి డాక్టర్ జవేరియా, ఎన్‌ఎచ్‌ఎం డీపీవో స్వామి, వైద్యులు ఉన్నారు.

మంత్రుల పర్యటన ముగిసింది..
గాయత్రి పంపుహౌస్ బంద్ అయ్యింది..

రామడుగు, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): గాయత్రి పంపుహౌస్ నుంచి వరద కాలువ నీరు విడుదల మంత్రుల పర్యటన ముగియడంతోనే బంద్ అయ్యిందని మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఆదివారం మంత్రులు ఉత్తమ్ కుమార్‌రెడ్డి, తుమ్మల నాగేశ్వర్‌రావు, అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, పొన్నం ప్రభాకర్ కరీంనగర్, పెద్దపల్లి జిల్లాల పర్యటన నేపథ్యంలో రైతులు ఎక్కడ అడ్డుకుంటారోనన్న భయంతో కాళేశ్వరం లింకు-2 మోటార్లను ఆన్ చేయించారని, గంటలోపే గాయత్రి పంపుహస్ మోటార్లు బంద్ చేశారని పేర్కొన్నారు. నీళ్ల విడుదల చేయని పక్షంలో రైతుల పక్షాన ఉద్యమాలు, నిరసనలు తీవ్రతరం చేస్తామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు.

అంగన్‌వాడీ కేంద్రాల్లో సమస్యల తిష్ఠ

హుజూరాబాద్‌రూరల్, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆయా గ్రామాల్లో అంగన్‌వాడీ కేంద్రాలు సమస్యల మధ్య కొనసాగుతున్నాయి. ఇరుకుగదులు, గర్భిణులు, బాలింతలు కూర్చునేందుకు కుర్చీలు లేకపోవడం కేంద్రాల పరిస్థితికి అద్దం పడుతోంది. పలు గ్రామాల్లోని కేంద్రాలకు మరుగుదొడ్లు లేవు. ఉన్నతాధికారులు స్పందించాలని ప్రజలు కోరుతున్నారు.

నగర పాలక సంస్థ అధికారులతో సమీక్ష

కరీంనగర్ టౌన్, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): నగరపాలక సంస్థ కార్యాలయం ఆవరణలోని కళాభారతిలో వార్డు ఆఫీసర్లు, రెవెన్యూ, పారిశుధ్య విభాగం అధికారులు, సిబ్బందితో కమిషనర్ ప్రఫుల్‌దేశాయ్ సోమవారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వార్డు ఆఫీసర్లు ప్రతీ రోజు ఉదయం పారిశుధ్య పనులను పర్యవేక్షించాలన్నారు. కార్మికుల హాజరు శాతం వార్డు ఆఫీసర్లే నమోదు చేయాలన్నారు.

మొక్కలు నాటడం ప్రతీ పౌరుడి ప్రథమ కర్తవ్యం

కరీంనగర్ స్పోర్ట్స్, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): మొక్కలు నాటడం ప్రతీ పౌరుడు ప్రథమ కర్తవ్యంగా భావించాలని కరీంనగర్ డిప్యూటీ రేంజ్ ఆఫీసర్ నర్సింగరావు అన్నారు. సోమవారం పతంజలి యోగా సమితి, భారత స్వాభిమాన్, యువత భారత్ సంయుక్త ఆధ్వర్యంలో ఆయుర్వేద శిరోమణి, పతంజలి అధినేత ఆచార్య బాలకృష్ణ జన్మదినం సందర్భంగా నగరంలోని టీడీపీ ఫంక్షన్‌హాల్ ఆవరణలో మొక్కలు నాటారు. మొక్కలు మానవజాతి మనుగడకు ఎంతో దోహదపడతాయన్నారు. యువ భారత్ జిల్లా అధ్యక్షుడు రమేష్, పతంజలి యోగా సమితి బాధ్యులు లక్ష్మీనారాయణ, మనోజ్ కుమార్ ముందాడ, శేఖర్, గడ్డం మధు, ఏలేటి శ్రీనివాస్, సత్యం తదితరులు పాల్గొన్నారు.



మొక్క నాటుతున్న డిప్యూటీ రేంజ్ ఆఫీసర్ నర్సింగరావు

తహసీల్దార్‌పై చర్యలు తీసుకోవాలి



నిరసన తెలుపుతున్న బాధితులు

సుభాష్‌నగర్, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): తమను ఇబ్బందులకు గురిచేస్తున్న తహసీల్దార్‌పై చర్యలు తీసుకోవాలని చిగురుమామిడి మండల కేంద్రానికి చెందిన చిట్టెల మైసవ్వ, చిట్టెల రాములు డిమాండ్ చేశారు. సోమవారం ప్రజావాణికి మోకాళ్లపై నడుచుకుంటూ వచ్చి నిరసన వ్యక్తం చేశారు. కలెక్టర్ వెంటనే స్పందించి తమకు న్యాయం చేయాలని కోరారు

క్యాంపస్ టు కార్పొరేట్‌పై అవగాహన సదస్సు

గణేశ్‌నగర్,ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలోని కంప్యూటర్ విభాగం ఆధ్వర్యంలో సోమవారం క్యాంపస్ టు కార్పొరేట్ పేరుతో న్యూ జీన్‌టెక్ సాఫ్ట్‌వేర్ సంస్థ అవగాహన సదస్సు నిర్వహించింది. ఈ సందర్భంగా సంస్థ సీఈవో కిషోర్ మాట్లాడుతూ ఫ్యూచర్ టెక్నాలజీస్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్(ఏఐ), డేటా సైన్స్, క్లౌడ్ కంప్యూటింగ్, సైబర్ సెక్యూరిటీ వంటి ఆధునిక రంగాల ప్రాధాన్యాన్ని వివరించారు. అనంతరం కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ వరలక్ష్మి మాట్లాడుతూ విద్యార్థినులకు ఉద్యోగ అవకాశాలు, సాఫ్ట్‌వేర్ రంగంలోని పరిణామాలపై అవగాహన కల్పించేందుకు కార్యక్రమం నిర్వహించినట్లు చెప్పారు. కంప్యూటర్ విభాగం ఇన్‌చార్జి డాక్టర్ కల్పన, అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

పారమిత విద్యాసంస్థల అధినేత జన్మదిన వేడుకలు



నిత్యావసరాలు పంపిణీ చేస్తున్న ప్రసాదరావు

కరీంనగర్ టౌన్, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): పారమిత విద్యాసంస్థల అధినేత డాక్టర్ ఇనుగంటి ప్రసాదరావు జన్మదిన వేడుకలను సోమవారం విద్యా సంస్థల్లో ఘనంగా నిర్వహించారు. నగరంలోని హౌసింగ్‌బోర్డు కాలనీలోని వీరబ్రహ్మేంద్ర స్వామి అనాథ వృద్ధాశ్రమానికి పాఠశాలలో ఏర్పాటు చేసిన ఫిలాంత్ర ఫి ట్రస్టు ద్వారా అనాథలకు నిత్యావసర సరుకులు అందించారు. డైరెక్టర్లు ప్రసూన ప్రసాదరావు, రశ్మిత, రాకేష్, ప్రాచీ, అనూకర్‌రావు, వినోదరావు, టీఎస్వీ రమణ, వీయూఎం ప్రసాద్, హనుమంతరావు, ప్రధానోపాధ్యాయులు గోపీకృష్ణ, ప్రశాంత్, బాలాజీ, శ్రీకర్, శర్మిష్ఠ, కవిత ప్రసాద్, సమన్వయకర్తలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విమలక్కకు జయశంకర్ స్మారక స్ఫూర్తి పురస్కారం

కరీంనగర్ కల్చరల్, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): ఆచార్య కొత్తపల్లి జయశంకర్ స్మారక రాష్ట్ర స్థాయి స్ఫూర్తి పురస్కారాన్ని 2025 సంవత్సరానికి బుధవారం కరీంనగర్ ఫిలింభవన్‌లో అరుణోదయ విమలక్కకు అందజేయనున్నట్లు తెరవే రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు కొండి మల్లారెడ్డి, బూర్ల వేంకటేశ్వర్లు ఒక ప్రకటనలో తెలిపారు. ఏటా తెలంగాణ రచయితల వేదిక ఆధ్వర్యంలో పురస్కారం ప్రదానం చేస్తు న్నట్లు పేర్కొన్నారు. హైకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ చంద్రకుమార్, పుర స్కార ప్రదాత, డీకే ఫౌండేషన్ చైర్మన్ కాళిదాసు హాజరుకానున్నట్లు చెప్పారు.

అనుమతి లేని కళాశాలలను మూసివేయాలి

సుభాష్‌నగర్, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): డిస్ట్రిక్ట్ ఇంటర్మీడియట్ ఎడ్యుకేషన్ అనుమతి లేకుండా నిర్వహిస్తున్న ప్రైవేటు జూనియర్ కళాశాలలను మూసివేయాలని యూఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి సంద గణేశ్ కోరారు. ఈ మేరకు సోమవారం ప్రజావాణిలో కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత విద్యాసంవత్సరంలో అనుమతిలేని కళశాలల్లో చేరిన విద్యార్థులకు వార్షిక పరీక్షలకు సంబంధించిన హాల్‌టికెట్లు రాక విద్యార్థులు వారి తల్లిదండ్రులు తీవ్ర ఆందోళనకు గురయ్యారన్నారు.

ఆపదలో ఉన్న మహిళను కాపాడిన లేక్ పోలీసులు

కరీంనగర్ క్రైం, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ కిసాన్‌నగర్‌కు చెందిన బోజనపల్లి స్వరూప(30) కుటుంబ సమస్యలతో కరీంనగర్ లోయర్ మానేరు డ్యాంలో ఆత్మహత్యకు యత్నించగా పోలీస్ కానిస్టేబుల్ సారయ్య, హోంగార్డు ఎంఏ హఫీజ్ బేగ్‌లు ఆమెను కాపాడారు. అనంతరం ఆమెను లేక్ పోలీస్ ఔట్ పోస్టుకు తరలించారు. లేక్ ఎస్సై రమేష్ కౌన్సెలింగ్ నిర్వహించి కరీంనగర్ త్రీ టౌన్ పోలీస్ స్టేషన్‌లో అప్పగించారు.

ఎస్సారార్ కళాశాలను సందర్శించిన కేయూ తనిఖీ బృందం

గణేశ్‌నగర్,ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): ఎస్సారార్ ప్రభుత్వ ఆర్ట్స్ అండ్ సైన్స్ అటానమస్ కళాశాలను పరిశోధన కేంద్రంగా గుర్తించడానికి కాకతీయ యూనివర్సిటీ తనిఖీ బృందం సోమవారం సందర్శించింది. పరిశోధన కేంద్రానికి అవసరమైన వనరులను పరిశీలించింది. ఈ సందర్భంగా తనిఖీ బృందం సభ్యులు మాట్లాడుతూ పరిశోధన కేంద్రంగా గుర్తించడానికి అవసరమైన అన్ని అకాడమిక్ వసతులు ఉన్నాయని, అర్హులైన అధ్యాపకులు ఉన్నారని తెలిపారు. అనంతరం కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య రామకృష్ణ మాట్లాడుతూ ఎస్ఆర్ఆర్ కళాశాల పరిశోధన కేంద్రంగా గుర్తించడానికి అవసరమైన అన్ని సౌకర్యాలను కలిగి ఉందన్నారు. కళాశాలలోని తెలుగు, కామర్స్ వృక్ష, జంతు శాస్త్ర విభాగాలను పరిశోధన కేంద్రాలుగా గుర్తించాలని, అర్హులైన అధ్యాపకులను పరిశోధన పర్యవేక్షకులుగా నియమించాలని కోరారు. బృందం సభ్యులు ఆచార్య సురేందర్ రెడ్డి సైన్స్ విభాగాల డీన్, ఆచార్య గోన నాయక్ ఆర్ట్స్ విభాగాల డీన్, అడ్మిషన్ల డైరెక్టర్ డాక్టర్ జాఫర్ జరి, వైస్ ప్రిన్సిపాల్ నితిన్ పాఠక్, రాజయ్య, టీజీసీజీటీఏ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ కడారు సురేందర్ రెడ్డి, పరిశోధన కమిటీ సమన్వయకర్త డాక్టర్ మల్లారెడ్డి, అధ్యాపకులు పాల్గొన్నారు.



ఫైళ్లు పరిశీలిస్తున్న కేయూ బృందం

బెంగుళూరులో 'వైరాగ్యం' పత్ర సమర్పణ

కరీంనగర్ కల్చరల్, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి) : బెంగుళూరు యూనివర్సిటీ వేంకటగిరి గౌడ వేదికపై తెలుగు శాఖ సోమవారం ఆచార్య కొలకలూరి ఆశాజ్యోతి సాహిత్యం-సమాలోచన అంశంపై సదస్సు నిర్వహించింది. ఈ సదస్సులో నగరానికి చెందిన రచయిత, భవానీ సాహిత్య వేదిక అధ్యక్షుడు వైరాగ్యం ప్రభాకర్ పత్ర సమర్పణ చేశారు. అనంతరం యూనివర్సిటీ ప్రొఫెసర్ కె.లావణ్య, కొలకలూరి ఆశాజ్యోతి వైరాగ్యంను సన్మానించారు. ఈ సందర్భంగా కవులు, రచయితలు అభినందనలు తెలిపారు.



సన్మానిస్తున్న నిర్వాహకులు

ఆర్టీసీ పుణ్యక్షేత్రాల టూర్ ప్యాకేజీ

భగత్‌నగర్, ఆగస్టు4 (ఆంధ్రజ్యోతి): శ్రావణ మాసం సందర్భంగా కరీంనగర్ బస్టాండ్ నుంచి ఏడుపాయలు, బంగారు లింగం, యాదగిరిగుట్ట, స్వర్ణగిరి దర్శనాల ప్రత్యేక టూర్ నిర్వహిస్తున్నట్లు ఆర్టీసీ కరీంనగర్-1 డిపో మేనేజర్ విజయమాధురి ఒక ప్రకటనలో తెలిపారు. బుధవారం ఉదయం 4 గంటలకు సూపర్ లగ్జరీ బస్సు కరీంనగర్ బస్టాండ్ నుంచి బయల్దేరి రాత్రికి చేరుకుంటుందని పేర్కొన్నారు. ఈ టూర్ ప్యాకేజీలో పెద్దలకు రూ.1050, పిల్లలకు రూ.880గా నిర్ణయించినట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని, వివరాలకు 7382849352, 9959225920, 8074690491 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

సీజనల్ వ్యాధులపై అవగాహన

ఇల్లందకుంట, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): సీజనల్ వ్యాధులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మండల వైద్యాధికారి తులసీదాస్ అన్నారు. సోమవారం మండలంలోని సిరిసేడులో వైద్యశిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికి తిరుగుతూ ఫీవర్ సర్వే చేశారు. గ్రామస్తులకు వైద్యపరీక్షలు నిర్వహించారు. సీహెచ్‌వో శ్యామల, ఏఎన్ఎం సత్య, రజిత, మానస, ఆశావర్కర్లు, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఢిల్లీ ధర్నాకు తరలిన కాంగ్రెస్ బీసీ నేతలు

తిమ్మాపూర్, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద కాంగ్రెస్‌పార్టీ బీసీ విభాగం ఆధ్వర్యంలో నిర్వహించనున్న ధర్నాలో పాల్గొనేందుకు సోమవారం మానకొండూర్ నియోజకవర్గం నుంచి బీసీ నాయకులు తరలివెళ్లారు. తిమ్మాపూర్ మండల కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు తమ్మనవేని రాములు యాదవ్, మానకొండూర్ మండల బీసీ సెల్ అధ్యక్షుడు కానిగంటి మల్లికార్జున్, బీసీ సెల్ జిల్లా ప్రధానకార్యదర్శి శ్రీనివాస్ ఉన్నారు.

ఇల్లందకుంట: ఇల్లందకుంట నుంచి వెళ్లిన వారిలో ఆలయ చైర్మన్ ఇంగిలే రామారావు, శ్రీకాంత్, మహేందర్, శివ, సాహెబ్ హుస్సేన్, అఫ్జర్ పాల్గొన్నారు.

శిబు సోరెన్ లేనిలోటు తీరనిది

సుభాష్‌నగర్, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): జార్ఖండ్ మాజీ ముఖ్యమంత్రి శిబు సోరెన్ లేని లోటు తీరనిదని రైతు, ప్రజాసంఘాల సమాఖ్య జాతీయ అధ్యక్షుడు పోలాడి రామారావు ప్రకటనలో తెలిపారు. ఆది వాసీల హక్కుల కోసం, ప్రాంతీయ అస్థిత్వం కోసం శిబూ సోరెన్ చేసిన అలుపెరుగని పోరాటం తెలంగాణ సాధనకు స్ఫూర్తి పేర్కొన్నారు.

లక్ష్మీదేవికి ప్రత్యేక పూజలు

కరీంనగర్ కల్చరల్, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి) : శ్రావణమాసం సందర్భంగా సోమవారం స్థానిక కట్టరాంపూర్, వినాయక నగర్‌కు చెందిన మహిళలు ఒక చోట చేరి లక్ష్మీదేవికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయాలు కిటకిటలాడాయి.

హుస్నాబాద్ గడ్డమీద బీజేపీ జెండా ఎగురవేయాలి

చిగురుమామిడి, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఎన్నికల్లో హుస్నాబాద్ నియోజకవర్గ గడ్డమీద బీజేపీ జెండాను ఎగురవేయాలని బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, ఉప్పల్ మాజీ ఎమ్మెల్యే ఎన్‌వీఎస్ఎస్ ప్రభాకర్ అన్నారు. సోమవారం మండలంలోని చిన్నముల్కనూర్‌లో స్థానిక ఎన్నికల కార్యశాల అసెంబ్లీ కన్వీనర్ గుర్రాల లక్ష్మారెడ్డి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కేంద్రం ప్రభుత్వ అమలు చేస్తున్న సంక్షేమపథకాలపై ప్రజలకు వివరించాలని అన్నారు. బీజేపీ రాష్ట్ర కార్యవర్గసభ్యుడు కోమటి రెడ్డి రాంగోపాల్‌రెడ్డి మాట్లాడుతూ అభివృద్ధి కార్యక్రమాలకు నిధులు కేటా యిస్తున్న కేంద్రమంత్రి బండిసంజయ్‌కు హుస్నాబాద్ నియోజకవర్గ ప్రజలు బ్రహ్మరథం పట్టేందుకు నియెజకవర్గ ప్రజలు సిద్ధంగా ఉన్నారని అన్నారు. బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు దేర్నెట్టి సంపత్, వీరమళ్ల రవీందర్, మండల అధ్యక్షుడు పోలోజ్ సంతోష్‌కుమార్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే ఎన్‌వీఎస్ ప్రభాకర్

గ్రామీణ వికాసం బీజేపీతోనే సాధ్యం

శంకరపట్నం: గ్రామీణ వికాసం బీజేపీతోనే సాధ్యమని బీజేపీ మండలాధ్యక్షుడు ఏనుగుల అనిల్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలో గ్రామీణ వికాసం బీజేపీతోనే సాధ్యం అనే కరపత్రాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో నాయకులు కొంరయ్య, రాములు, నరేందర్, అశోక్, శ్రీనివాస్, రాజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అంబరాన్నంటిన కోటా-పరిచయ్2కే25



నృత్యం చేస్తున్న విద్యార్థులు

భగత్‌నగర్, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): నగరంలోని కోటా ఇనిస్టిట్యూట్‌లో సోమవారం కోటా-పరిచయ్2కె25 పేరుతో నిర్వహించిన ఫ్రెషర్స్‌డే వేడుకలు అంబరాన్నంటాయి. కోటా ఇనిస్టిట్యూట్, కోటా పబ్లిక్ స్కూల్ చైర్మన్ డాక్టర్ డి. అంజిరెడ్డి వేడుకలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరీక్షల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచి విద్యాసంస్థకు, తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకు రావాలన్నారు. రాష్ట్రస్థాయిలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు జ్ఞాపికలు అందజేశారు. అనంతరం చైర్మన్ డాక్టర్ అంజిరెడ్డి జన్మదిన వేడుకలను నిర్వహించారు. ప్రిన్సిపాల్ బి.సుదర్శన్, అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు భద్రతా నియమాలపై అవగాహన



నియమాలపై వివరిస్తున్న అధికారి

కరీంనగర్‌క్రైం,ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): రోడ్డు భద్రతా నియమాలపై నగరంలో సోమవారం అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమానికి కోరా జాన్సన్ పాఠశాల విద్యార్థులు హాజరయ్యారు. టీడీవో పురుషోత్తం, ఏఎంవీఐ స్రవంతి, ఓజ, అస్లాం, జయ, పాఠశాల చైర్మన్ మహిపాల్ రెడ్డి, డైరెక్టర్లు వరప్రసాద్, రాంరెడ్డి, సింహాచలం హరికృష్ణ, సంతోష్ రెడ్డి పాల్గొన్నారు.

గ్రామాల్లో కుక్కల బెడద

మానకొండూర్, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వివిధ గ్రామాల ప్రజలు కుక్కల భయంతో వణికిపోతున్నారు. ప్రధాన వీధుల్లో రోడ్లపై కుక్కలు గుంపులుగా ఉండడంతో జంకుతున్నారు. చిన్నపిల్లలు, విద్యార్థులు పాఠశాలలకు వెళ్లి ఇంటికి వస్తుండగా వారిని వెంబడిస్తూ దాడికి పాల్పడుతున్నాయి. పెద్దలు సైతం ఇంటినుంచి వెళ్లే సమయంలో కర్రలను వెంట తీసుకెళ్తున్నారు. కుక్క కాటుతో ప్రతీరోజు ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో కేసులు నమోదవుతున్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి కుక్కల బెడద నుంచి కాపాడాలని మండల ప్రజలు కోరుతున్నారు.



మానకొండూర్‌లో కుక్కల గుంపు

నాలుగు గంటల నీటి విడుదలకు నలుగురు మంత్రులు

రామడుగు, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): నాలుగు గంటలు నీటిని విడుదల చేయడానికి నలుగురు మంత్రులు రావడం హాస్యాస్పదంగా ఉందని బీజేపీ రాష్ట్ర కార్యవర్గసభ్యుడు మేకల ప్రభాకర్‌యాదవ్ అన్నారు. సోమవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ రామడుగు మండలంలో పర్యటన సందర్భంగా వచ్చిన మంత్రులకు కనీసం మండలంలోని నియోజకవర్గ పరిధిలోని సమస్యల పట్ల అవగాహన లేదని విమర్శించారు. స్థానిక సమస్యలను మంత్రుల దృష్టికి ఎమ్మెల్యే తీసుకెళ్లకపోవడం శోచనీయమన్నారు. కేవలం నాలుగు గంటలు మాత్రమే నీటిని విడుదల చేసి ఆపడం ఏమిటని ప్రశ్నించారు. రైతులకు తిరిగి నీటిని విడుదల చేయాలని కోరారు. సమావేశంలో మండల అధ్యక్షుడు మోడీ రవీందర్, మండల ప్రధాన కార్యదర్శి పోచంపెల్లి నరేష్, పూరెళ్ల శ్రీకాంత్‌గౌడ్, రవీందర్ పాల్గొన్నారు.

భవన నిర్మాణ కార్మికుల సమస్యలను పరిష్కరించాలి

గన్నేరువరం, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): భవన నిర్మాణ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని భవన నిర్మాణ ఆల్ వర్కర్స్ యూనియన్ జిల్లా కన్వీనర్ కోట రాములు అన్నారు. సోమవారం మండల కేంద్రంలో భవన నిర్మాణ కార్మికుల సంఘం మండల అధ్యక్షుడు మైసంపల్లి మల్లేశం అధ్యక్షతన నిర్వహించిన సమావేశానికి ఆయన హాజరై మాట్లాడారు. ఇల్లు లేని కార్మికులకు ఇల్లు నిర్మించి ఇవ్వాలని, 50 సంవత్సరాలు నిండిన కార్మికుడికి 5వేల పింఛన్ ఇవ్వాలని తదితర డిమాండ్లు చేశారు. కార్యక్రమంలో యూనియన్ జిల్లా కోకన్వీనర్ గామినేని సత్తయ్య, మధుసూదన్‌రావు, నగునూరు రమేష్, తదితరులు పాల్గొన్నారు.

పోగొట్టుకున్న సెల్‌ఫోన్ అప్పగింత

కరీంనగర్ క్రైం, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్‌కు చెందిన శ్యామ్ 2024 మే 19న తన సెల్‌ఫోన్‌ను బొమ్మకల్ వద్ద పోగొట్టుకొని కరీంనగర్ రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు పోలీసులు సీఈఐఆర్ టెక్నాలజీతో గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. సోమవారం బాధితుడిని ఠాణాకు పిలిపించిన కరీంనగర్ రూరల్ సీఐ నిరంజన్‌రెడ్డి ఫోన్‌ను అప్పగించారు. ఫోన్‌ను గుర్తించి స్వాధీనం చేసుకోవడంలో కృషి చేసిన కానిస్టేబుల్ విశ్వతేజను సీఐ అభినందించారు.